Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.1

November 2024



## శిష్యత్వం

**ఎడిటోరియల్**

# మన జీవనశైలి?



ఆఫ్రికా దేశానికి ఒకాయన సువార్త చెప్పడానికి వెళ్ళి, "ప్రియులారా! యేసుక్రీస్తు ప్రభువు రెండువేల సంవత్సరాల క్రితం ఈ లోకానికి వచ్చాడు. ప్రజల పట్ల ఎంతో ప్రేమను, కనికరాన్ని చూపించాడు. రోగుల్ని స్వస్థపరిచాడు. దయ్యాల్ని వెళ్ళగొట్టాడు. పరిశుద్ధునిగా, దీనుడిగా జీవించాడు. పాపులైన మానవులకు దేవుని రాజ్యం గురించి ప్రకటించాడని" వివరించాడట. మీటింగ్ అయిన తర్వాత కొంతమంది ప్రజలు ఆయన దగ్గరకు వచ్చి "మీరు చెప్పిన ఆయనను మేము చూశాము, ఆయన మాకు బాగా తెలుసు, ఆయన మా దగ్గరే ఉన్నాడని" అన్నారట. అందుకు ఆ సువార్తికుడు ఆశ్చర్యంగా వారితో "ఆయన రెండువేల సంవత్సరాల క్రితం చనిపోయి, సమాధి చేయబడి, తిరిగిలేచి పరలోకానికి ఆరోహణమయ్యాడని" చెప్పగా, వారు "లేదండీ! ఆయన మా మధ్యనే ఉండేవాడు, ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు, మమ్మల్ని ప్రేమతో పలకరించేవాడు, ఆయన ప్రార్థన చేస్తే స్వస్థత కలిగేది. అంతేకాదు, ఆయన మా మధ్యనే చనిపోయాడు. ఆయనను మేమెంతో ప్రేమించాము, ఆయన గుండెను మా దగ్గరే ఉంచుకొన్నాము, రండి చూపిస్తామని" తీసుకువెళ్ళి చూపించారు. అది డేవిడ్ లివింగ్‌స్టన్ సమాధి. ఆఫ్రికా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మిషనరీ. ఆయన ఆఫ్రికా దేశములోని ప్రజల మధ్య క్రీస్తులా జీవించాడు. అక్కడ ఉన్నవారు ఆయనలో క్రీస్తును చూడగలిగారు.

యేసుక్రీస్తు ప్రభువును అంగీకరించిన తర్వాత ఒక విశ్వాసి లక్ష్యం క్రీస్తును పోలి నడుచుకోవడమే. దేవుడు మనలను తన కుమారునితో సారూప్యము గలవారిగా ఉండడానికి ముందుగా నిర్ణయించి (రోమా 8:29) అలా నడచుకోవాలని ఆశిస్తున్నాడు. "క్రీస్తును పోలి జీవించడమే ఈ ప్రపంచంలో అత్యున్నతమైన జీవన ప్రమాణం" అని అంటాడు విలియం బార్క్లే. "ఇది అత్యున్నతమైన జీవన విధానం" అని మార్టిన్‌లాయిడ్ జోన్స్ అంటాడు. "క్రీస్తును అనుకరించడం ప్రతి విశ్వాసి బాధ్యత" అని అలెగ్జాండర్ మాక్లారెన్ అంటాడు. "నేను క్రీస్తులా ఉండాలనుకొంటున్నాను, ఆయనను మాత్రమే అనుసరించాలని కోరుకొంటున్నాను" అని మిషనరీ అదోనీరామ్ జడ్సన్ అంటాడు. అపొస్తలుడైన పౌలు కూడా నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరును నన్నుపోలి నడుచుకొండి (1 కొరింథీ 11:1) అని విశ్వాసులకు పిలుపునిస్తున్నాడు.

క్రీస్తును పోలి నడుచుకోవడం ఎలా? ఆయన సారూప్యం మనలో ఎలా ఏర్పడుతుంది? అనే ప్రశ్నలకు "ద కంప్లీట్ బుక్ ఆఫ్ డిసైపుల్‌షిప్" అనే పుస్తకంలో బిల్‌హల్ ఆరు విషయాలను ప్రస్తావించాడు. 1. మనస్సు, 2. ప్రవర్తన, 3. సంబంధాలు, 4. అలవాట్లు, 5. సేవ, 6. ప్రభావం చూపించే విషయాల్లో సంపూర్ణంగా రూపాంతరం చెందాలని, క్రీస్తువలె జీవించాలని చెబుతాడు. రూపాంతరం చెందడమంటే కొన్ని చెడు అలవాట్లను మానుకోవడం, చెడ్డ మాటలను మాట్లాడకుండా ఉండడం, అనైతిక ప్రవర్తనను మానుకోవడం, జీవితంలో ప్రగతి సాధించడం, మెరుగవ్వడం కాదు. పాపంతో, అసత్యంతో సంబంధం ఉన్న పాత ఆలోచనా విధానాలు, అలవాట్లు, దృక్పథాలు, నమ్మకాలు, అభిప్రాయాలు మొదలగు వాటన్నిటినీ తీసివేసి వాటి స్థానంలో దేవుని సత్యంతో, దేవుని చిత్తంతో, ఆయన వాక్యంతో నింపుకొని దైవకేంద్రిత జీవితాన్ని జీవించడం. ఇలా దినదినం మన శరీరాల్ని సజీవయాగంగా ఆయనకు సమర్పించుకొంటూ, దేవుని వాక్య విలువలతో జీవిస్తూ ఉంటే క్రమక్రమంగా రూపాంతరం చెందుతూ క్రీస్తు పోలికలోకి మారతాము. యేసుక్రీస్తు దైవమానవునిగా ఈ లోకంలో జీవించినప్పుడు తన ప్రవర్తనలో, పరిశుద్ధతలో, ప్రార్థించడంలో, ఉపవాసంలో, ఉపదేశంలో, మాట్లాడడంలో, ప్రేమించడంలో సమస్త విషయాల్లో ఆయన ఎలా జీవించాడో అలా జీవిస్తాము. అప్పుడు ప్రజలు మనలోని క్రీస్తు సారూప్యాన్ని చూస్తారు.

నేడు సంఘంలో క్రైస్తవులని పిలవబడుచున్న వారు, నాయకులు, క్రీస్తును గూర్చి బోధించేవారు, పరిచర్య చేసేవారికి కొదువే లేదు గానీ, క్రీస్తును పోలి జీవించేవారి కొదువ తీవ్రంగా ఉంది. నూతన నిబంధనలో అంతియొకయ సంఘం క్రీస్తునుపోలి జీవించే సంఘంగా ఉంది. ఆ సంఘాన్ని గమనిస్తే వారు మొదట ప్రభువు తట్టు తిరిగారు (అపొ.కా. 11:21), తర్వాత ప్రభువును స్థిర హృదయంతో హత్తుకున్నారు (అపొ.కా. 11:23), ప్రభువు పక్షాన చేరారు (అపొ.కా. 11:24). వారి జీవనశైలి క్రీస్తును పోలి ఉండడం అక్కడి వారు గమనించి శిష్యులను క్రైస్తవులని పిలిచారు (అపొ.కా. 11:26). థెస్సలోనికయ సంఘం వారు కూడా ప్రభువును పోలి నడచుకొన్నారని (1 థెస్స 1:6) అపొస్తలుడైన పౌలు సాక్ష్యమిస్తున్నాడు. మనం క్రైస్తవులమైతే క్రీస్తును పోలి జీవించాలి, మన గురించి కూడా లోకం, తోటివారు సాక్ష్యమివ్వాలి. అలాంటి జీవనశైలి కలిగి ఉండేటట్లు ఆశిద్దాం, ప్రార్థిద్దాం, ప్రయాసపడదాం.

**– పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

# విద్యార్థి జ్వాల



Vol. 31, No. 1. November 2024
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-

FOR SUBSCPRICTION:
The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account No: 36698741798**
**Account Name: uesiap vj**
**IFS Code: SBIN0011994**
**SBI Nambur Branch**
**UPI ID: uesiapvj@sbi**

CONTACT:
The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

UPCOMING TOPIC:

December: Christmas

**Note:** Please send your writeups on or before
**10th of every month**



## శిష్యత్వపు వెల

“రక్షణ ఉచితమే గాని శిష్యత్వం ఖరీదు”. యేసు శిష్యునిగా ఉండాలంటే మనం కొంత వెల చెల్లించాలి. ఏంటా వెల? సిలువ. లూకా 9:23 “ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల.... ప్రతి దినము తన సిలువనెత్తుకొని నన్ను వెంబడించవలెను” సిలువను మోయాలి. సిలువను ధరించడం కాదు సిలువను భరించాలి. సిలువ అంటే శ్రమలు, అవమానాలు, అన్యాయానికి గురి కావడం, హేళనకు గురి కావడం. ఇవన్నీ శిష్యుని జీవితంలో సర్వ సాధారణం. ఎందుకంటే మనం ప్రవాహానికి ఎదురీదే బ్రతికిన చేపలం. దేవుని కొరకు నీతిగా యథార్థంగా జీవించాలంటే సిలువ భరించాల్సిందే. దేవుని దృష్టిలో సిలువలేని క్రైస్తవ్యం విలువలేని క్రైస్తవ్యం. అయితే మనం సహింపగలిగినంత కంటే ఎక్కువగా మన జీవితంలో శ్రమలను దేవుడు అనుమతించడు. ఈ సత్యాన్ని 1 కొరింథీ 10:13లో మనం చదవవచ్చు. అంతేకాదు సహించే మార్గాన్ని కూడా దేవుడు ఏర్పాటు చేస్తాడు.

## లోపలి పేజీల్లో...

- మన జీవన శైలి? - 2
- శిష్యత్వపు వెల - 3
- పట్టుదల, పద్ధతి, ప్రణాళికతో - 4
- గురువు - శిష్యుడు - 5
- ప్రాధాన్యతలు - 9
- ఎక్కడికి నీ పరుగు- 10
- యేసులో ఆనందింతును - 11
- నీతిమంతునిగా ప్రకటించడం - 14
- క్రీస్తుని ఆస్వాదించడం - 20
- అడుగు జాడలు - 23
- సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ - 24
- నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొందాం - 25
- నిలకడగా కొనసాగెదవా? - 29
- పేరుకే శిష్యులం - 32

హార్ట్ టు హార్ట్

# పట్టుదల, పద్ధతి, ప్రణాళికతో ప్రగతిపథంలోకి

ప్రపంచ మాజీ నెంబర్ వన్, భారత మహిళా స్టార్ ఆర్చర్ దీపిక కుమారి ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. మూడేళ్ళ తర్వాత సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్‌కప్ ఫైనల్లో ఆడిన దీపిక రజిత పతకాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా, ఐదోసారి వరల్డ్‌కప్ ఫైనల్ టోర్నీలో రజిత పతకం గెలిచిన భారత ఆర్చర్‌గా ఘనత సాధించింది. పట్టుదల, పద్ధతి, ప్రణాళిక ప్రకారం సాధన చేయడం వలన ఆమెకు ఇది సాధ్యమయ్యింది. ప్రాపంచిక విషయాలను ఎంతో శ్రద్ధగా చేస్తున్న అవిశ్వాసులు చాలామంది విశ్వాసుల కంటే ఎంతో మాదిరిగా ఉన్నారని గమనిస్తాం.



ప్రార్థనా పూర్వకంగా కొంతమందిని ఇవాంజిలిస్టిక్ క్యాంప్స్‌కి, రిట్రీట్స్‌కి, గాస్పల్ ఈవినింగ్స్‌కి హాజరయ్యేటట్లు చేయడం వలన మంచి ఫలితాలు వచ్చాయి. వారిలో యేసుక్రీస్తు ప్రేమను అంగీకరించి, ఆయనను వెంబడించే వారిని డిటి క్యాంప్స్‌కు నడిపించిన వారందరినీ అభినందిస్తూ ధన్యవాదాలు తెలుపుతున్నాను. వీరు అదే శిష్యత్వపు బాటలో పయనించాలంటే మన యంపిసిలు క్రమంగా ఉండాలని మనందరికీ బాగా తెలుసు. ప్రభువు యొక్క ప్రోత్సాహంతో ఈ బాధ్యతల్లో ముందుకు వెళదాం.

రానున్న డిసెంబర్ నెల సువార్త ప్రకటనకు ఎంతో అనుకూలమైనది. ఇప్పటికే మంచి ప్రసంగీకుల్ని ఎన్నుకొన్నాం. ఇంకా ఫైనలైజ్ కాని వాళ్ళు త్వరపడాలి. అనుకూలమైన తేదీలు, స్థలం, వాతావరణం, ఆర్థిక వనరులు ప్రభువిస్తారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా, ఇతరులకు ఆమోదయోగ్యంగా, దేవునికి మహిమకరంగా, అనేమంది విద్యార్థుల రక్షణ కొరకు ఈ సంవత్సరం క్రిస్మస్‌లు జరుపుకొందాం. ఇతరులకు అభ్యంతరకరంగా ఉండే విధానాలను విడిచిపెడదాం. ఆయన ప్రణాళికలో ఉండే వాళ్ళందరూ రావాలని పట్టుదల, పద్ధతి, ప్రణాళిక ప్రకారం ప్రభువును ప్రాధేయపడదాం. కొన్నిసార్లు చక్కగా మాట్లాడే స్పీకర్స్‌ని ఫిక్స్ చేయడం ద్వారా రిలాక్స్ అయ్యే ప్రమాదముంది. పరిశుద్ధాత్ముడు ప్రజల హృదయాల్లో పని చేయకపోతే ఎంతమంచి ప్రసంగమైనా వృథానే. దేవుని అద్భుతమైన సహాయం కొరకు ఇప్పటి నుంచే ప్రార్థిద్దాం. ఫాలోఅప్ కూడా ప్రధానమైనదిగా ఎంచుదాం. మనం ప్రజల కొరకు శ్రద్ధతో చేసే ప్రార్థనల ఫలితాన్ని ప్రస్ఫుటంగా చూద్దాం.

కండబలంతో, కనకంతో సాధించలేనివి – కన్నీళ్ళతో సాధిద్దాం.

అంగబలంతో సాధించలేనివి – అంగలార్పుతో సాధిద్దాం.

ప్రతిభతో సాధించలేనివి – ప్రలాపంతో సాధిద్దాం.

ప్రపంచమే ప్రగతి పథంలో పయనిస్తున్నప్పుడు, ప్రభువు పిల్లలు కూడా పవిత్రమైన విషయాల్లో తప్పక ప్రగతిని సాధించాలి. దానికోసం ప్రతిజ్ఞతో కూడిన మనసుతో కొనసాగాలని కోరుతూ...

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్

యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# గురువు-శిష్యుడు

## పరిచయం

మనిషి జన్మించిన నాటినుండి అతనికి సంబంధాలు అవసరం. అవి లేకపోతే అతని మనుగడ సాధ్యం కాదు. సంబంధాలు కుటుంబంలో ప్రారంభమవుతాయి. తర్వాత సంఘంలో, పాఠశాలలో, కార్యాలయంలో, సమాజంలో అవి కొనసాగుతాయి. కుటుంబంలోని సంబంధాల తర్వాత అత్యంత కీలకమైన సంబంధాలలో ఒకటి గురువు, శిష్యుని మధ్య ఉండే సంబంధం. భారతీయులమైన మనందరికి గురువు, శిష్యుడు అనే పదాలు బాగా పరిచయమే. ఈ సంబంధాన్ని చాలా గొప్పదిగా గుర్తించి, దానిని అనేక శతాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. అది చాలా పవిత్రమైన బంధంగా పరిగణించారు. ఈ సంబంధానికి సంబంధించి అనేక అద్భుతమైన కథలు మనకు ఉన్నాయి. ఈ సంబంధానికి పూర్వకాలంలో ఉన్నంత గౌరవం ఇప్పుడు లేకపోయినా, దీనికి ఈ రోజుల్లో కూడా ఎంతో కొంత గౌరవం ఉంది. దాదాపు అన్ని మతాల్లోను గురువు-శిష్యుడు అనే విషయం ఉన్నది. అయితే, సాంకేతిక పరిజ్ఞానం, మీడియా ఈ సంబంధానికి సరికొత్త అర్థాలను, అనుకరణను జోడించాయి. దీని అర్థం, పరిధి ఎంతో పెరిగిపోయింది. వ్యక్తిగత సంబంధాల స్థాయి నుండి వ్యక్తితో నేరుగా ఎలాంటి సంబంధంలేని స్థితికి ఇది మారిపోయింది. ఇప్పుడు గూగుల్ (ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్) ప్రపంచంలోనే అతి పెద్ద గురువుగా అవతరించింది. ఈ గురువుకి ప్రపంచ వ్యాప్తంగా లక్షలమంది శిష్యులు ఉన్నారు. ఏ అంశమైనాసరే ఈ గురువు బోధిస్తాడు. ఈ గురువుకు ఉద్యోగ విరమణ లేదు, జీతం తీసుకోడు, అలాగే 24/7 అందుబాటులో ఉంటాడు. ఇక్కడ విద్యార్థికి వయోపరిమితి లేదు. దీని అంతిమ ఫలితం ఏంటంటే, బోధించడానికి ఒక గురువు అందుబాటులో ఉంటాడు. నేర్చుకోవడానికి ఒక శిష్యుడు కూడా ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. ఇక్కడ శిష్యునికి ఉండే విచక్షణ ద్వారానే మేలుగానీ, కీడుగానీ జరుగుతుంది.

గురు-శిష్యుల సంబంధంలో బైబిల్ క్రీస్తు ప్రభువు అత్యంత గొప్ప గురువు అని తెలియజేస్తుంది. ఆయనకు కొద్దిమంది శిష్యులు ఉన్నారు. ఆయన వారిని తర్ఫీదు చేశాడు. ప్రభువైన యేసుక్రీస్తు ఈ భూమిమీద జీవించినప్పుడు ఆయనను ఇష్టపడేవారు, ద్వేషించేవారు కూడా ఆయనను 'బోధకుడా' అని పిలిచారు. ప్రతిసారి ఆయనను 'బోధకుడా' అని సంబోధించారు, 'ప్రసంగీకుడా' అని కాదు. తాను బోధకుడినని యేసుక్రీస్తు తనను గూర్చి తాను రెండు సార్లు చెప్పుకున్నాడు (మత్తయి26:18; యోహాను13:13-14). ప్రేషిత ఆజ్ఞలో కూడా, మనం వెళ్ళి ప్రకటించే పని మాత్రమే కాదు, బోధించి ఆయనకు శిష్యులుగా చేయమని ఉన్నది (మత్తయి 28:18-20). కాబట్టి, గురుశిష్యుల అంశాన్ని ప్రేషితసేవ ఆజ్ఞలో కూడా మనం చూడగలం.

## అర్థాలు

గురువు అనే పదానికి సాధారణమైన అర్థం, తన జ్ఞానాన్ని ఒక క్రమమైన పద్ధతిలో ఇతరులకు అందించి, నేర్పించేవాడే గురువు లేక బోధకుడు.

బోధకుడు లేదా గురువు నేర్పించే విషయాలను, అందించే జ్ఞానాన్ని నేర్చుకొనేవాడే శిష్యుడు.

గురుశిష్యుల మధ్య ఏర్పడిన నమ్మకమే ఈ సంబంధ విజయానికి కారణం అవుతుంది. గురువు

తన జ్ఞానాన్ని నమ్మకంగా తన శిష్యునికి అందించాలి. శిష్యుడు తన గురువు నుండి నేర్చుకొనే విషయంలో నమ్మకంగా ఉండాలి. ఇది పరస్పర నమ్మకం, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం. అయితే ఈ గురు శిష్యుల సంబంధాన్ని గూర్చి బైబిల్ ఏమి చెబుతుంది?

## గురువు (బోధకుడు)

బోధకుడు అనే మాటను గ్రీకులో 'డిడాస్కాలోస్' అని అంటారు. ఈ గ్రీకు పదాన్ని హీబ్రూలో 'రబ్బీ' అని అనువదించారు లేదా బోధించే అంశం ద్వారా వింటున్న ఒక వ్యక్తి చిత్తాన్ని గురువు ప్రభావితం చేస్తాడు. దానిని ఒక మంచి స్థితిలోకి మారుస్తాడు. పాత నిబంధనను బోధించే అధికారంగల వారిని, దైవిక సత్యాలను బోధించే వారిని డిడాస్కోలో అని యేసుక్రీస్తు జీవించినకాలంలో పిలిచేవారు. ఈ పదం కొత్త నిబంధనలో 58సార్లు ఉపయోగించగా, అందులో 41 సందర్భాల్లో యేసుక్రీస్తును ఉద్దేశించి ఈ పదం వాడడం జరిగింది. బోధకుడా అని యేసుక్రీస్తును ఆయన శిష్యులు (మార్కు 4:38), పరిసయ్యులు (మత్తయి 8:19;12:38), హేరోదియులు (మత్తయి 22:16), సద్దూకయ్యులు (మార్కు 12:19), ఒక ధర్మశాస్త్ర బోధకుడు (మార్కు 12:32), మోసకారియైన ఒక యూదుడు (లూకా 20:21), ధనవంతుడైన ఒక యవనస్థుడు (లూకా 18:18), సుంకరులు (లూకా 3:12), తన శిష్యురాలైన మార్త (యోహాను 11:28) పిలిచారు. యేసుక్రీస్తు ఖచ్చితంగా ఒక బోధకుడే. కేవలం ఒక తరగతికి పరిమితమైన బోధకుడు కాదు ఈయన. ఆయన ప్రతిచోటా బోధించాడు. అంతేకాదు ప్రతి వ్యక్తి మనోగతాలు తెలిసిన పరమ గురువు.

## శిష్యుడు

శిష్యుడు అనే మాటకు గ్రీకులో ఉపయోగించిన పదం 'మథెటెస్', ఈ పదం 'మంథనో' అనే గ్రీకుపదం నుండి వచ్చింది. దీనర్థం 'నేర్చుకోవడం', 'మాత్' అనే పదం దీనికి మూలం. 'మాత్' అంటే 'ఆసక్తితో ప్రయత్నించి, శ్రమించి సాధించడం' అని అర్థం. (ఈ పదం నుండే మేథమెటిక్స్ అనే ఇంగ్లీష్ పదం వచ్చింది). నియతవిధానం (ఫార్మల్)లోగానీ, అనియత విధానంలో (ఇన్‌ఫార్మల్) గానీ ఒక వ్యక్తి బోధన నుండి నేర్చుకోవడం అనేది ఈ పదం యొక్క అర్థం. పరిశీలన, విచారణ ద్వారా ఆసక్తితో



నేర్చుకోవడం అనే అంశం శిష్యత్వంలో ఇమిడి ఉంది. కాబట్టి, 'మతెటీ' అంటే అర్థం ఒక విద్యార్థి అని మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువ. ఒక బోధకుడిని అనుకరించే వాడని కూడా ఈ పదం అర్థం ఇస్తుంది. 'మతెటీ' అనేది ఆధ్యాత్మికతకు సంబంధించిన పదం కాదు. యేసుక్రీస్తును నిజంగా వెంబడించిన శిష్యులకు, పైపై భక్తితో ఆయనను వెంబడించిన శిష్యులకూ ఈ పదాన్ని వాడడం జరిగింది.

సిద్ధాంత పరమైన, అభ్యాసనాత్మకమైన జ్ఞానాన్ని ఒక వ్యక్తినుండి సంపాదించుకోవడానికి తనను తాను బద్ధునిగా చేసుకొన్న వ్యక్తిని 'మథెటీ' (శిష్యుడు) అని అంటారు. అతను ఒక వ్యాపార సంబంధమైన విషయాలలో శిక్షణ తీసుకొనే వ్యక్తియైనా అయి ఉండవచ్చు, వైద్యశాస్త్రాన్ని అభ్యసించే ఒక విద్యార్థి అయినా కావొచ్చు, లేదా ఒక తాత్విక పాఠశాలలో సభ్యుడైనా అయి ఉండవచ్చు. డిడాస్కాలో ఆధ్వర్యం, శిక్షణలో మాత్రమే ఒక వ్యక్తి 'మెథెటీ'గా మారగలడు. సాధారణంగా ఒక శిష్యుడు తన గురువుకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

గ్రీకు సంస్కృతి ప్రభావం ఆనాటి కాలంలో ఎంత శక్తివంతంగా ఉందంటే, రోమీయులు గ్రీకులను ఓడించిన తర్వాత కూడా ఆనాటి ప్రజల సంస్కృతిపై ఉన్న గ్రీకు ప్రభావాన్ని తీసివేయలేకపోయారు. కాబట్టి, బలవంతంగా ప్రజలను పనులు చేయించే బాహ్యపరమైన అధికారం కన్నా, ప్రజల ఆలోచనా విధానానికే అధిక ప్రాధాన్యత ఉండేది. శిష్యులుగా చేయమని ప్రభువు ఆ ఆజ్ఞ ఎందుకిచ్చారో అర్థం చేసుకోడానికి ఈ నేపథ్యం మనకు సహాయపడుతుంది. ఇవి సరిగా జరిగితే ఒక శిష్యుడు జీవితాంతం వెంబడిస్తాడు. ఎందుకంటే, ఆత్మలకోసం జరిగే యుద్ధం మొదట మనసులో జరుగుతుంది. సులభంగా చెప్పాలంటే, శిష్యుడనే వ్యక్తి నేర్చుకొనేవాడు మాత్రమే కాదు, వెబండించేవాడు కూడా. అందుకే యేసుక్రీస్తు

తరచూ ఇలా చెప్పేవాడు 'నన్ను వెంబడించు' (మత్తయి 4:19;మార్కు 1:17; యోహాను 1:43). బాప్తీస్మమిచ్చు యోహానుకు అనుచరులు లేక శిష్యులు ఉన్నది అందుకే. పరిసయ్యులకు కూడా శిష్యులు ఉండేవారు (మార్కు 2:18).

## గురు శిష్యుల మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించిన షరతులు

ఒక విశ్వాసి ప్రభువుతో ఉన్న శిష్యరికపు సంబంధాన్ని కొనసాగించకుండా ఒక విశ్వాసిగా మాత్రమే మిగిలిపోయే అవకాశం ఉంది. అయితే, శిష్యుడు తన శిష్యత్వ క్రమంలో ఆయనతో సంబంధాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.

**అంగీకారం**: గురుశిష్యుల మధ్య బంధం పరస్పర అంగీకారంతో మొదలవుతుంది. యేసుక్రీస్తు తన శిష్యులకు తర్ఫీదు ఇవ్వడం ప్రారంభించకముందు, ఆయన వారిని మొదట అంగీకరించాడు, వారిని పిలిచాడు. ఆయనను వెంబడించడానికి వారు కూడా అంగీకరించారు. ప్రతి శిష్యుడు కూడా ఒక విశిష్టమైన వ్యక్తి, అనేక విషయాల్లో విభిన్నమైన వ్యక్తి. ఒక మంచి బోధకుడు తన శిష్యుని ఖచ్చితంగా అంగీకరించాలి.

**ఆత్మీయబంధం**: ఒక వ్యక్తిని తన శిష్యునిగా అంగీకరించినంత మాత్రాన సరిపోదు. హాజరు పట్టికలో ఒకవ్యక్తి పేరు రాసుకోవడం మాత్రమే కాదు గానీ అతనితో ఒక అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి. అనుమానం, పక్షపాతం, అశ్రద్ధలను ఇది తొలగించి, ఆ వ్యక్తిపై వ్యక్తిగత శ్రద్ధ, పర్యవేక్షణను కలిగి ఉండేటట్లు చేస్తుంది. యేసుక్రీస్తు తన శిష్యులతో గడిపిన మూడున్నర సంవత్సరాల కాలంలో వారితో గొప్ప అనుబంధాన్ని కలిగి ఉన్నాడు. అనేకమంది శిష్యులుగా ఆయనను వెంబడించారు, అనేకమంది ఆయనను విడిచిపెట్టారు (యోహాను 6:66). కానీ పన్నెండు మంది ఉన్న ఒక ప్రత్యేకమైన సమూహంతో ఆయన అన్యోన్యతను కలిగి ఉన్నాడు. వారికి వ్యక్తిగతంగా తనయందు నిలిచి ఉండమని ఆయన బోధించాడు.

**నిబద్ధత**: గురుశిష్యుల మధ్య నిబద్ధత లేకపోతే ముందు చెప్పిన రెండు విషయాలు నిరుపయోగమవుతాయి. ఒకరినొకరు నమ్మలేరు, ఆధారపడలేరు. ఈ నిబద్ధతను ఇద్దరూ చూపించాలి. ఇద్దరూ కష్టసమయాలను ఎదుర్కొనే అవకాశం ఉంది. తుఫానులు చెలరేగే అవకాశం ఉంది. అలాంటి సమయాలలో నిబద్ధత వారిని ఒకటిగా ఉంచుతుంది. తమ గురువు అరెస్టయినప్పుడు, శిష్యులు ఆయనను విడిచి పారిపోయారు. అయితే, పునరుత్థానుడైన తర్వాత ఆ గురువు వారి వద్దకు వెళ్ళాడు. ఆయన వారిని విడిచిపెట్టలేదు. వారి దగ్గరకు వెళ్ళి వారిని ధైర్యపరచాడు, ప్రోత్సాహపరచాడు, పని అప్పగించాడు. మనము కూడా వెనుకంజ వేసేవారిని అలా చేయడానికి చొరవ చూపాలి.

**అభివృద్ధి**: పై మూడు విషయాల అంతిమ లక్ష్యం శిష్యులు తమ గురువులా మారిపోవడం. "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి" (1కొరింథీ 11:1) అని పౌలు తెలియజేశాడు. "నేను మీకు గురువును అయినప్పటికీ మన అందరికీ ప్రభువైన యేసుక్రీస్తు గురువు" అని పౌలు తెలియజేస్తున్నాడు.

**శక్తివంతులుగా చేయడం**: తన శిష్యులకు యేసుక్రీస్తు ప్రభువు ఎన్నో విషయాలు బోధించాడు. నాకంటే గొప్ప కార్యాలు చేస్తారని, గురువుని మించిన శిష్యులు కాగలరని ప్రబోధించాడు. ఆయన పరలోకానికి ఆరోహణమవ్వక మునుపు ఒక గొప్ప ప్రేషిత ఆజ్ఞను ఆయన వారికి ఇచ్చాడు. తర్వాత, పెంతెకొస్తు రోజున శిష్యులు పరిశుద్ధాత్మ దేవుని శక్తిని పొందుకున్నారు. ఆ రోజున ఏం జరిగిందో మనందరికీ తెలుసు. వెళ్ళి, సువార్తను ప్రకటించమనే ఆజ్ఞను ప్రభువు వారికి ఇచ్చాడు.

## గురువును వెంబడించడం ఎలా? ఆయన నుండి ఏమి నేర్చుకోవాలి?

శిష్యునిగా ఉండడానికి, అభిమానిగా ఉండడానికి చాలా తేడా ఉంది. జనసమూహాలు ఆయనను వెంబడించారు. వారందరూ ఆయన శిష్యులు కాదు. నిజానికి వారంతా అభిమానులు. క్లిష్టమైన సమయం వచ్చేసరికి వారంతా తమ గురువును విడిచి వెళ్ళారు. 'అభిమాన సంఘాలు' అనే పదం మనకు తెలిసిందే. ఈ రోజుల్లో కూడా క్రీస్తు ప్రభువుకు అనేకమంది అభిమానులు ఉన్నారు. దీనికి కారణాలు ఉండవచ్చు.

కాబట్టి, గురువును వెంబడించాలంటే, లూకా 9:23లో ఆయన తెలియజేసిన షరతులకు లోబడాలి.

**అ. ఎవడైననూ:** ఆయనను వెంబడించడం అనేది



స్వతహాగా, ఇష్టపూర్వకంగా చేయాల్సిన పని. బలవంతమేమీ లేదు.

**ఆ. నన్ను:** ఆయనను ప్రభువుగా అంగీకరించడం. ఇక జీవించువాడను నేను కాదు.

**ఇ. వెంబడింపగోరిన యెడల:** ఇది ఒక పని. ఎవరూ ఆపలేని బలమైన కోరిక, ఒక ప్రక్రియ.

**ఈ. తన్నుతాను ఉపేక్షించుకొని:** పాత స్వభావానికి సంబంధించిన విలువలను, ప్రాధాన్యతల ను వదులుకోవడం, ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు.

**ఉ. సిలువను ఎత్తుకొని:** చెల్లించాల్సిన వెల ఉన్నది. శిష్యత్వం చౌకైనది కాదు. యేసుక్రీస్తును వెంబడించడం చాలా ఖరీదైన విషయం. అయితే, ఆయనను వెంబడించకపోవడం ఇంకా ఎక్కువ ఖరీదైన విషయం.

**ఊ. నన్ను వెంబడించవలెను:** విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడునైన క్రీస్తువైపు చూడాలి. ఆయన అందరికీ ప్రభువు. శిష్యత్వం అనేది ఒక జీవితకాల ప్రక్రియ. దానిని మధ్యలోనే ఆపివేయడం మంచిది కాదు.

## నేర్చుకోవాల్సిన సత్యాలేంటి?

ఒక బోధకునిగా ఆయన ఎంతో విజయవంత మయ్యాడు, ఎంతో ప్రసిద్ధి చెందాడు. ఆయన బోధలు అధికారంతో కూడి అనేకమందిని ఆకర్షించాయి. వారిలో నికోదేము ఒకడు. ఇతను స్వయంగా ఒక బోధకుడు. గానీ, యేసుక్రీస్తును అతను కలుసుకొన్న సందర్భంలో, 'నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము" (యోహాను 3:2) అని అన్నాడు. యేసుక్రీస్తు బోధలు ప్రజలను విస్మయపరచాయి. "ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాట్లాడలేదనిరి" (యోహాను 7:46). గొప్ప అధికారంతో, శక్తితో, సరళతతో, నిలకడతో సాధారణ సంఘటనలను కథలు, ఉపమానాల ద్వారా ఆయన బోధించాడు. మన గురువైన యేసుక్రీస్తు నుండి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

**1. మన గురువు యొక్క సత్ప్రవర్తన, గుణము:** సహజంగా గురువు యొక్క గుణము మీద కాకుండా, అతను బోధించే విషయం మీదనే ఎక్కువగా నొక్కి చెప్పడం జరుగుతుంది. క్రీస్తు విషయంలో అలా కాదు. ఆయన బోధలు ఆయన బోధించిన విషయాలు గాక, ఆయన గుణాన్ని ప్రతిబింబించాయి. ఆయన బోధలోను, ఆయన జీవితంలోను మృదుత్వం, నిరాడంబరత కనిపిస్తాయి.

**2. గురువు యొక్క ప్రభావం:** కొంతమంది ఉచ్చరణ మీద ఎంతగా దృష్టిపెడతారంటే, అవి వినేవారి మీద ఏ విధమైన ప్రభావం చూపించవు. అయితే, యేసుక్రీస్తు బోధలు మనస్సాక్షిని మేల్కొలిపాయి, మనసును వెలిగించాయి, హృదయాన్ని రగిలించాయి. యావత్ మానవజాతి శారీరిక, సామాజిక, ఆధ్యాత్మిక తృష్ణలను తృప్తిపరిచాయి.

**3. జీవనశైలి, జీవితం యొక్క శైలి:** ఆయన బోధించిన విషయాల ప్రకారమే జీవించాడు. జీవించినదే బోధించాడు. తమ బాహ్య సౌందర్యాల పైనే ఎక్కువ దృష్టి పెడుతున్న ఈనాటి బోధకుల్లా ఆయన జీవించలేదు.

**4. సరళమైన భావ వ్యక్తీకరణ:** ఇలానే బోధించాలనే పరిమితులు ఆయనకు లేవు. కొన్ని నమూనాలను ఆయన అనుసరించలేదు. ఎలాంటి పక్షపాతం ఆయన చూపించలేదు. తన శిష్యులలో ఒకరిని ఒకరకంగా, మరొకరిని ఇంకోరకంగా చూడలేదు. పెద్ద పెద్ద పదాలు ఉచ్చరించలేదు. సరళమైన భాష, సామాన్య జీవనం నుండి సరళమైన ఉదాహరణలు ఉపయోగించి ఆయన బోధించాడు. మనుష్యులను సంతోషపరిచే కుయుక్తులు, చమత్కారాలు, కల్పితమైన మాయమాటలు ఆయన ఎన్నడూ బోధించలేదు.

– రెవ.జి. జెఫన్యా పీటర్
సీనియర్ పాస్టర్, యునైటెడ్ చర్చ్, బిహెచ్ఇయల్, హైదరాబాద్



ప్రత్యేకం

# ప్రాధాన్యతలు

శిష్యరికం అంటే మారుమనస్సు పొందిన వ్యక్తి తనను పిలిచిన యేసువలె మారడానికి జీవితాంతం ఆయన యొద్ద నేర్చుకోవడం. సిలువ దగ్గరకు విశ్వాసంతో వచ్చిన వారు ఆయన పిల్లలు అనబడతారు. సిలువను జీవితాంతం మోసుకొని ఆయనను వెంబడించేవారు శిష్యులన బడతారు. రక్షణపొందిన రోజు నుండే శిష్యరికంలోకి అడుగు పెడతాము.

ఆయన వలె మారే ప్రక్రియలో మనం రోజువారీ జీవితంలో అనేక ప్రాధాన్యతలు చాలా ప్రభావితం చూపిస్తాయి. ఆయనను వెంబడించేవారు ఎటువంటి ప్రాధాన్యతలు కలిగి ఉండాలో కొండమీద ప్రసంగంలో (మత్తయి 6:19-34) ప్రభువు స్పష్టం చేశారు.

1. వేటిని ప్రాధాన్యంగా ఎంచకూడదు? (19-24వ)
2. వేటిని ప్రాధాన్యాలుగా ఎంచాలి? (25-34వ)

## 1. వేటిని ప్రాధాన్యంగా ఎంచకూడదు? (19-24వ)

### ఎ. రెండు రకాల ధనాలు (19-21వ)

భూసంబంధమైన ధనం పాడైపోయేది, మన దగ్గర ఎల్లకాలం ఉండనిది, మనం విడిచి పెట్టేది. పరలోక ధనం ఈ లోకంలో చదువులోను, ఉద్యోగంలోను, పరిచర్యలోను మన నమ్మకత్వాన్ని బట్టి పరలోకంలో దేవుడిచ్చే ధనం. అది నిత్యం మనతోపాటు ఉండేది. మన మనస్సును దేవుని వైపు నుండి, దేవుడిచ్చిన బాధ్యతల వైపు నుండి పక్కకు మళ్ళించే ప్రతిది భూసంబంధమైన ధనం లాంటిది. అది ఒక వస్తువు కావొచ్చు, వ్యక్తి కావొచ్చు. కాబట్టి దేవుడిచ్చిన ఈ చిన్న జీవితాన్ని ఏ ధనం సంపాదన కోసం మన సమయం, ధనం ఖర్చు చేస్తున్నాం?

### బి. రెండు రకాల దృష్టి కోణాలు (22-23వ)

కన్ను మనం వెళ్ళే మార్గాన్ని, దూరాన్ని, గమ్యాన్ని, చూపిస్తుంది కాబట్టి దేహానికి కన్ను దీపమైంది. మన కన్ను మన మనస్సునకు, హృదయానికి సంబంధం కలిగి ఉంది. మనం చూసేది మన మనస్సులోకి వెళ్ళుతుంది. మన మనస్సులోకి వెళ్ళింది మన హృదయాన్ని ప్రేరేపిస్తుంది. అప్పుడది క్రియగా బయటకు వస్తుంది. ఈ విషయం యోబుకు బాగా అర్థమై "న్యాయమైన త్రాసులో ఆయన నన్ను తూచును గాక. నేను త్రోవవిడిచి నడచినయెడల నా మనస్సు నా కన్నులను అనుసరించి సంచరించినయెడల మాలిన్యమేమైనను నా చేతులకు తగిలినయెడల నేను విత్తినదానిని వేరొకడు భుజించును గాక నేను నాటినది పెరికివేయబడును గాక" (యోబు 31:7,8) అని అంటాడు.

శరీరం యొక్క ఆరోగ్యం ఆహారంపై ఎలా ఆధారపడిందో, మనస్సు యొక్క ఆరోగ్యం కన్నుల ద్వారా ఏం చూస్తున్నామో అనే దానిపై ఆధారపడి ఉంది. అందుకే కీర్తనాకారుడు 101:3 లో "నా కన్నుల యెదుట ఏ దుష్కార్యాన్ని ఉంచుకొనను" అన్నాడు. తేటకన్ను మన ఆత్మీయ జీవితానికి వెలుగునిస్తుంది. చెడు కన్ను మన ఆత్మీయ జీవితాన్ని దిగజారుస్తుంది. "నీ కన్ను నిన్ను అభ్యంతర పరిస్తే దాన్ని పెరికి పారవేయి" అని మన ప్రభువు అంత కఠినంగా చెప్పారంటే కళ్ళ ద్వారా ఎంత పాపం మనలోకి వస్తుందో ఆలోచించాలి.

**సి. రెండు రకాల యజమానులు - (24వ)**

గ్రీకు రోమన్ సంస్కృతిలో వ్యాపారంలో నష్టపోయినప్పుడు లేదా పేదవారు తమను తాము బానిసలుగా అమ్ముడు పోయేవారు. అయితే రెండు ఉద్యోగాలు చేయొచ్చు గాని ఒక బానిసకి యజమానుడు ఒక్కడే ఉంటాడు. యూదా సాహిత్యంలో దేనినైతే భరోసాగా భావిస్తారో దానికి సిరి అనే పదం వాడారు. దేవుడిలో తప్ప మరి దేనిలో అయినా మన భద్రత, మన సంతోషం వెతుక్కొంటే నష్టపోతాము. బానిస యొక్క సమీప బంధువు దేవాలయం ద్వారా కొనుక్కొన్న యజమానుడికి తగిన రుసుము చెల్లించి విడిపించినట్లు, ప్రభువు తన స్వరక్తాన్నిచ్చి కొనుక్కొన్న మనము ఆయనకు దాసులుగా బతకాల్సిన వారమైయున్నాము. అయితే చాలా మంది దేవుడిచ్చిన స్వాతంత్ర్యాన్ని వారి సొంత ఇష్టాలను నెరవేర్చుకొంటూ దుర్వినియోగ పరచడం బాధాకరం.

## 2. వీటిని ప్రాధాన్యంగా ఎంచాలి (25-34వ)

**ఎ. ప్రతి అవసరానికి దేవునిపై ఆధారపడడం (25-31వ)**

ఈ లోకంలో అల్పమైన వాటిని ప్రభువు ప్రతి రోజు అంత శ్రద్ధగా పట్టించుకొంటున్నప్పుడు మన కోసం ప్రాణం పెట్టి కొనుక్కొన్న మనల్ని వదిలేస్తాడా? మన ప్రతి కోర్కెను తీర్చకపోవచ్చు గానీ, ప్రతి అవసరం దేవుడు తగిన సమయంలో తీరుస్తాడు. మనల్ని దీవించడానికి దేవునికి కావాల్సింది మన నమ్మకత్వం. ప్రార్థన చేసుకొంటే అన్ని మన దగ్గరకు వస్తాయని కాదు గానీ మనం చేసే చిన్న పనైనా నమ్మకంగా చేస్తే దేవుడు దీవిస్తాడు.

**బి. ఆయన రాజ్యాన్ని నీతిని వెదకడం (32-33వ)**

మనం ఆయన కృపను బట్టి విశ్వాసం ద్వారా ఆయన రాజ్య సంబంధులమయ్యాము. ప్రతి రోజు మన నిర్ణయాలు, ప్రణాళికలు, ఇష్టాలు ఆయన అధికారం క్రింద ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతి విషయంలోను ఆయన నడిపింపును కోరుకోవాలి. ఎందుకంటే ఆయన మన రాజు (సామె 3:5,6; కొలస్సీ 1:12)

**సి. ఈ రోజు నా బాధ్యత (34వ)**

రేపటి గురించి ఆలోచించడం తప్పుకాదు గానీ చింతించడం తప్పు. మన ప్రభువు రేపు కూడా కూడా ఉన్నాడని నమ్మాలి. రేపటిని గూర్చి ఆలోచిస్తూ ఈ రోజు మన బాధ్యతను మర్చిపోకూడదు, నిర్లక్ష్యం చేయకూడదు. అది చదువైనా, ఉద్యోగమైనా.

**ముగింపు**

ఈ ప్రాధాన్యతల ఎంపిక మన మనసుల్లో జరుగుతుంది. మన మనస్సే ఒక యుద్ధ భూమి. లోకము, సాతాను మన మనస్సుపై ఎప్పుడూ దాడి చేస్తారు. కాబట్టి ప్రతిరోజు వాక్య సత్యం చేత మన మనస్సులను నింపుకొని ఆ సత్యంతో బ్రతికేటట్లు దేవుని మీద ఆధారపడాలి.

- **సాయి,** భీమవరం

## ఎక్కడికి నీ పరుగు?

ప్రభువు హృదయం నశించే వారి కోసం
నలిగిపోతుంటే - నశించిపోయే ఈ లోకం
కోసమే నువ్వు నలిగిపోతున్నావే

విలువైన సువార్తను ప్రకటించేవారు లేక
విద్యార్థులు నశిస్తుంటే - విలువ లేని వాటి
కోసం వెల చెల్లిస్తున్నావే..

ధనమే జగం అని వెర్రివాళ్లు ఊహల్లో
తేలిపోతుంటే - గెహజీలా ధనం కోసం నీవు
పరుగెడుతున్నావే

స్వమహిమ కోసం హేరోదులా ఈ ప్రపంచం
అంతా పరితపిస్తుంటే - ప్రభువుని
చూపించాల్సిన నీవు నిన్నే ఈ ప్రపంచానికి
చూపెడుతున్నావే

నశించిన వారి కోసం ప్రభువు తన రక్తాన్ని
కారిస్తే - నశించే విద్యార్థుల కోసం కన్నీళ్లు
కార్చే సమయం లేదా నీకు?

ఎక్కడికి ఈ పరుగు? ఎవరి కోసం?
ఎందుకోసం?

ప్రభువును వెదకడమే మన జీవిత పరమార్థం
కాదా?

దేవా! నా హృదయము పగలనివ్వు నా కన్నులకు
కన్నీళ్ళివ్వు

నా కొరకు కాదు గాని నశించి, నలిగిపోతున్న
వారి కొరకు - ఎంతలా అంటే నా కన్నీరు నిన్ను
కదిలించేలా...

- **జి. పవన్ కుమార్,** విస్సన్నపేట



# యేసులో ఆనందింతును

'యేసులో ఆనందింతును
సిలువలో అతిశయింతును
ఆశతో ఆరాధింతును
ఆ దివ్య ప్రేమామయుని'

ఈ పాటలో దేవరాజు అన్న క్రైస్తవులు యేసునందు ఆనందించాలని రాశాడు. అపోస్తులుడైన పౌలు కూడా అన్ని పరిస్థితులలో అన్ని సమయాలలో ప్రభువు నందు ఆనందించుడి అని ఫిలిప్పీయులకు రాశాడు. అంటే క్రైస్తవులు ఎప్పుడూ క్రీస్తునందు ఆనందించాలి. కానీ ప్రస్తుత దినాల్లో క్రైస్తవులు అన్నీ ఉన్నా కూడా ఆనందంగా ఉండలేక పోతున్నారు. కారణం ఏంటి? ఎలా క్రీస్తులో ఆనందించాలనే విషయాలు తెలుసుకుందాం.

## ఆనందం లేకపోవడానికి ఆటంకాలు

నేటి దినాల్లో పనుల ఒత్తిడి , బిజీగా ఉండే జీవన విధానం, డబ్బు సంపాదనపై ఆసక్తి, కారు, ఇల్లు, పిల్లల చదువులకు, ఫర్నిచర్, బంగారం కొనడానికి, చేసిన అప్పులకు నెలవారి కట్టాల్సిన ఇయంఐల భారం వల్ల జీవితంలో ఆనందం లేకుండా పోయింది.

అంతేకాకుండా ఇప్పటి చదువుల వల్ల మార్కులే గాని వ్యక్తిత్వ వికాసం సరిగా ఉండక పోవడం, చేరుకోలేని టార్గెట్స్‌తో కూడిన ఉద్యోగాలు, విలువలు లేని వ్యవస్థలు, తక్కువ జీతం ఇచ్చి ఎక్కువ పనిని ఆశిస్తున్న కార్పొరేట్ కల్చర్, చెడ్డ అధికారుల కింద పని చేయడం విశ్వాసుల జీవితాల్లో ప్రశాంతత కొరవడేలా చేస్తున్నాయి.

సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం తద్వారా చేయాల్సిన పనులు సకాలంలో చేయక పోవడం, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మొదలగు వాటి పై స్వీయ నియంత్రణ లేకపోవడం. యూట్యూబ్‌కి అలవాటై బయటకు రాలేకపోవడం. అవసరంలేని ఫోన్ కాల్స్‌కి మెసేజ్‌కి ఎక్కువ సమయం కేటాయించడం. వీటి ద్వారా అపరాధ భావన న్యూనతాభావానికి లోనై ఆనందాన్ని పోగొట్టుకొంటున్నాము. విశ్వాస జీవితంలో ఆత్మీయంగా వెనకబడిపోతూ, విశ్వాస జీవితాన్ని ఆనందంగా గడపలేక పోతున్నాము.

వీటితో పాటు రాజకీయ, మతపరమైన, వాతావరణ, ఆరోగ్యపరమైన సమస్యలు ఎప్పుడూ నిప్పుల కుంపటిలా ఉండనే ఉన్నాయి. ఇవి విశ్వాస జీవితాన్ని భయంలోకి నెట్టాయి.

వీటన్నిటికీ కారణం క్రీస్తును అంగీకరించిన విశ్వాసులు కూడా సాతానుతో నడిచే అవిశ్వాసుల్లాగా ఆలోచన చేయడం మరియు జీవించడం. డబ్బు, వస్తువులు, పేరు ప్రఖ్యాతులు, సుఖభోగాలపై ఆసక్తి, మనుషులను సంతోషపెట్టాలనే భావన, విలువలతో రాజీ పడడం, సరైన సంబంధాలు లేకపోవడం, సంపాదనపై ఉన్న ఆసక్తి పిల్లల్ని పెంచడంపై లేకపోవడం లాంటివి.

ఆత్మీయ విషయాల పట్ల అనాసక్తి, వాక్యం, ప్రార్థన, వ్యక్తిగత పరిశుద్ధత, సహవాసం అంటే నిర్లక్ష్యం వంటివి విశ్వాస జీవితాన్ని ఇంకా దుర్భరంగా చేశాయి. ఆనందం లేకుండా విశ్వాస జీవితములో జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నాము.

అయితే మనం నిజమైన ఆనందాన్ని యేసు క్రీస్తు నందు మాత్రమే పొందగలము. యేసును

హృదయంలోనికి అంగీకరించినప్పుడు, అనగా ఆయనతో సంబంధం లోనికి వచ్చినప్పుడు నిజమైన ఆనందం సొంతం చేసుకున్నాము. ఇప్పుడు మనం ఆ ఆనందంలో నిత్యము కొనసాగాలంటే ఆయనతో మన సహవాసం సన్నిహితంగా ఉండాలి. అప్పుడు మన ఆనందం పరిపూర్ణమవుతుంది.

## యేసులో ఆనందించడం ఎలా?

**1. క్రమమైన వాక్య ధ్యానంలో ఆనందించడం:** యేసుక్రీస్తు శిష్యులు ఆయన బోధలు, మాటల యందు ఆనందించారు. అర్థం గాని విషయాలను అడిగి తెలుసుకొని సంతోషించారు. మరియ కూడా యేసు పాదాల యెద్ద కూర్చుని యేసుక్రీస్తు



బోధ వినడంలో ఆనందించింది. తోటి సహోదరి పనులతో చాలా బిజీగా ఉన్నా, తొందరపడుచున్నా కూడా మరియ యేసు పాదాల వద్ద ఆయన మాటలు అలకిస్తూ ఆనందించింది. మనం ప్రతిరోజు యేసు పాదాల చెంత కూర్చోవడం అలవర్చుకోవాలి. ఈ బిజీ జీవన విధానంలో క్రమమైన మౌన ధ్యాన సమయం, ప్రార్థన సమయం అర్థవంతంగా గడపడం ద్వారా ఆయన సన్నిధిలో మనం ఆనందించగలం. అపొస్తలుడైన పౌలు కొలస్సీయులకు రాస్తూ "క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యండి (3:16) అప్పుడు మీరు ఆనందకరమైన జీవన విధానం కలిగి ఉంటారు (3:17) అని చెబుతాడు.

**2. ఆయనను ఎరగడంలో ఆనందించడం:** దేవుడు చేసే కార్యాల ద్వారా, ఆయన వాక్యం ద్వారా మనం ఆయనను అర్థం చేసుకోవాలి. అప్పుడే మనం అన్ని పరిస్థితులలో ఆనందంగా ఉండగలం. శిష్యులు యేసు క్రీస్తు గాలిని, నీటిని నిమ్మళింపచేయడం చూచి ఆశ్చర్యపోయారు. ఆయన మాటకు గాలి, నీరు లోబడుచున్నవి. అలాంటి యేసుక్రీస్తు తమతో దోనెలోనే ఉన్నాడు. సృష్టిపై ఆయన అధికారాన్ని అర్థం చేసుకున్నారు (లూకా 8:22-25). మనము కూడా యేసుక్రీస్తు ఏమై ఉన్నాడో అర్థం చేసుకోవడంలో ఎదగాలి. మోషే కూడా దేవుని ఎరగాలని ఎంతో ఆత్రుతగా అడిగాడు (నిర్గమ 33:17-19). దేవుడు అయన ఆశను తీర్చాడు. ఎన్నో అనుభవాలు ఇంతకుముందు ఉన్నా దేవుని ఎరగాలనే ఆశను కోల్పోలేదు. తద్వారా దేవునిని గూర్చిన అవగాహనలోనూ, అనుభవంలోనూ మోషే ఎదిగాడు. ముగ్గురు శిష్యులు రూపాంతర కొండమీద యేసును చూసి పర్ణశాలలు కట్టాలనుకున్నారు కానీ అది కాదు ఆయన మాటకు లోబడి జీవించాలని అర్థమయింది. దేవుని ఎక్కువగా తెలుసుకోవడానికి ఎప్పుడూ ఆసక్తి కలిగి ఉండాలి. అలా ఎరగడం వల్ల ఆయన ఎలా జీవించాలని కోరుకున్నాడో అలా జీవించగలం, అన్ని పరిస్థితుల్లో ఆనందంగా ఉండగలం.

**3. ప్రార్థనలో ఆనందించాలి:** యేసుక్రీస్తు మన కొరకు విజ్ఞాపన ప్రార్థన చేశారు (యోహాను 17:21, రోమా 8:34). యేసుక్రీస్తు మన కొరకు ప్రార్థించారు, ప్రార్థిస్తూనే ఉన్నారు. ఇది మనకి ఎంతో ధైర్యాన్ని ఆనందాన్ని ఇచ్చే విషయం. పౌలు కూడా సంఘానికి ఉత్తరాలు రాస్తున్నప్పుడు మీ కొరకు ఎల్లప్పుడూ ప్రార్థిస్తున్నాను అన్నాడు. బంధకాలలో, బాధలలో పౌలు ఇతరుల కొరకు ప్రార్థించడంలో ఆనందించాడు. అందుకే ఫిలిప్పీయులకు రాస్తూ ఆనందించండి అని చెప్పాడు. మనము కూడా సాతాను బంధకాల్లో ఉన్న వారి కొరకు, విశ్వాసాన్ని బట్టి బాధింపబడుచున్న వారి కొరకు ప్రార్థించాలి. ఇందులో ఎంతో తృప్తి ఆనందం ఉంటుంది.


**4. పరిశుద్ధాత్మ ఆధీనంలో ఉండడంలో ఆనందించడం:** యేసుక్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు తండ్రి తనను పంపిన ఉద్దేశం నెరవేర్చడం చూసి ఆత్మలో ఎంతో ఆనందించాడు (లూకా 10:21). విశ్వాసులమైన మనం కూడా ఆత్మ దేవుని ఆధీనంలో ఉండి జీవించడం వలన దేవుని చిత్తాన్ని నెరవేర్చగలము. పరిశుద్ధంగా జీవించగలం. అననుకూల పరిస్థితుల్లో ఆదిమ సంఘం వలె సాక్షులుగా ఉండగలం. అందుకే పౌలు ఆత్మపూర్ణులై ఉండండి అన్నాడు (ఎఫెసీ 5:18). అప్పుడు ఆనందంతో కూడిన జీవన విధానం గూర్చి (ఎఫెసీ 5:8-20), ప్రేమతో కూడిన సంబంధాల (ఎఫెసీ 5:21-6:9) గురించి బోధించాడు. పాపంతో నిండిన లోకంలో, అనానుకూల పరిస్థితుల్లో యేసులో ఆనందమైన జీవితం పరిశుద్ధాత్మ నింపుదల వలన మాత్రమే సాధ్యమవుతుంది.

**5. యేసుక్రీస్తుని సేవించడంలో ఆనందించడం:** యేసుక్రీస్తు పరిచర్య చేయడంలో ఎంతో

ఆనందించాడు. తిరస్కరించబడిన కుష్ఠ రోగి పట్ల ప్రేమ చూపడం, ఎలాంటి ఆధారం లేని వారి పట్ల దయ చూపడం, ఆకలితో ఉన్న వారి పట్ల, కాపరి లేని గొర్రెల వలె ఉన్న ప్రజల పట్ల కనికరం చూపడం, బంధించబడిన వారిని విడిపించడం లాంటివి ఆయన ప్రజలకు చేసిన సేవ. ఈ సుగుణాలను యేసుక్రీస్తు మన పట్ల కూడా చూపుచున్నాడనేది ఎంతో ఆనందాన్ని ఇచ్చే విషయం. మనం కూడా దేవుడు మనకు అప్పగించిన పరిచర్యలో వ్యక్తులను ప్రేమించడం, సరైన విధంగా విశ్వాసంలో పెంచడం, వారి అవసరాల పట్ల సున్నితంగా ఉండడం, శ్రద్ధ చూపడం, తిరస్కరించబడిన వారిపట్ల, వెనుక బడిన వారి పట్ల, నిర్లక్ష్యానికి గురైన వారి పట్ల ప్రేమ చూపడం లాంటివి మనకు ఆనందాన్ని ఇస్తాయి.

**6. యేసుక్రీస్తు క్షమాపణలో ఆనందించాలి:** యేసు క్రీస్తు మన పాపములను క్షమించాడు. శిష్యుడైన పేతురును క్షమించి పని అప్పగించాడు. చాలామంది విశ్వాసులు యేసుక్రీస్తు ఇచ్చే క్షమాపణ సరిగా అర్థం చేసుకోవడంలో పొరబడి అపరాధ భావనలో జీవిస్తున్నారు. తద్వారా ఆనందంగా ఉండాల్సిన జీవితం అపరాధ భావనతో ఉన్నది. యేసు మన ప్రతి పాపమును క్షమించి పవిత్రపరచును (1యోహాను 1:9). ఆయన క్షమాపణలో ఆనందం ఉంది. ఎజ్రా, నెహెమ్యాలు కూడా యెహోవా ఇచ్చు క్షమాపణలో ఆనందించడం వలన బలము పొందుతారు అన్నారు (నెహెమ్యా 8:10). మనము ఇలాంటి క్షమాపణ మనసు కలిగి ఉండాలి (కొలస్సీ 3:13). క్షమించలేని మనసు అశాంతికి కారణం. మనం పని చేసే చోట సహవాసంలో సఖ్యమైతే అందరితో సమాధానంగా ఉందాం. మనకు కీడు చేసిన వారిని కూడా ప్రభువువలె క్షమిద్దాం.

**7. శ్రమలలో ఆనందించడం:** అపోస్తులుడైన పౌలు తాను యేసుక్రీస్తు కొరకు అనుభవించుచున్న శ్రమలలో సంతోషించుచున్నాను అన్నాడు (కొలస్సీ 1:24), యేసుక్రీస్తు పక్షాన శ్రమ పడుట మనకు అనుగ్రహింపబడినది అని రాశాడు (ఫిలిప్పీ 1:29). శిష్యులు కూడా హింసలను, అవమానాలను భాగ్యంగా ఎంచుకొని సువార్త పనిలో ముందుకు సాగారు. యేసుక్రీస్తు కూడా మన కొరకు శ్రమ పడ్డాడు. యేసుక్రీస్తు ఆయన నిమిత్తము జనులు హింసించి నిందించి అబద్ధముగా చెడ్డ మాటలెల్ల



పలుకునప్పుడు సంతోషించి ఆనందించమన్నాడు (మత్తయి 5: 11-12) కాబట్టి క్రీస్తు నిమిత్తం, సువార్త కొరకు శ్రమ పడడంలో మనం ఆనందించాలి. అప్పుడు మనము ప్రభువు వలన బహుమానం పొందుతాము. శ్రమలలో విశ్వాస జీవితంలో కృంగి పోకూడదు. పౌలు వలే క్రీస్తునందు ఆనందించాలి. శ్రమల పట్ల మన దృక్పథం మారాలి.

## ముగింపు

క్రీస్తు మన కొరకు ఏమి చేశాడో, ఆయనలో మన స్థితి, మన భద్రత, మన భవిష్యత్ ఏంటో అర్థం చేసుకోవాలి. ఆయనలా జీవించడమే విశ్వాస జీవితానికి ఆనంద రహస్యం. మన పూర్వీకులు యేసులో ఆనందించిన వారే. ఆయనను ఎరుగుటలో, ఆయన వాక్యాన్ని ధ్యానించుటలో, ఆత్మ ఆధీనంలో జీవించడంలో, ఆయనను సేవించడంలో ఎంతగానో ఆనందించారు. వారు ఈ లోక విషయాల యందు ఆనందించక ప్రభువులో ఆనందించారు. కాబట్టే ప్రొఫెసర్ ఇనాక్ గారి కుటుంబం పిల్లలు లేకపోయినా ఆయనపై ఆధారపడుతూ, ఆత్మ చేత నడిపింపబడి, అప్పగించిన పరిచర్యను ఆనందంతో చేశారు. డాక్టర్ స్టెరెట్ గారు సుఖ భోగాలను లక్ష్యపెట్టక వాటిని విడిచి వచ్చి భారతదేశంలోని విద్యార్థుల రక్షణ కొరకు పని చేశారు. చాందపిళ్ళ గారు కఠిన పరిస్థితుల్లో కూడా ఆనందంగా ప్రభువుని సేవించారు. జోసఫ్ అభిషేక్ రావు గారు ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థుల కొరకు అననుకూల, అనారోగ్య పరిస్థితుల్లో కూడా అలుపెరుగని పరిచర్య జరిగించాడు. మన పితరులు మనకు ఎంతో మాదిరి కాబట్టి మనం ఈ లోకాన్ని బట్టి కాకుండా యేసు ప్రభువు నందు ఆనందిస్తూ (ఫిలిప్పీ 4:4) విశ్వాస జీవితంలో ముందుకు సాగుదాం. అందుకే మరలా హృదయపూర్వకంగా 'యేసులో ఆనందింతును' అని పాడుకుందామా!

**– ఆర్. రాజ్‌కుమార్,** స్టాఫ్, తిరుపతి



# నీతిమంతునిగా ప్రకటించడం

"సంఘం నిలిచి ఉండడమా లేక కుప్ప కూలి పోవడమా అని నిర్ణయించే ప్రధాన విశ్వాస సూత్రం ఈ సిద్ధాంతం" అని మార్టిన్ లూథర్ అనే భక్తుడు అంటాడు. ఈయనే కాదు 16వ శతాబ్దపు సంఘ సంస్కర్తలు ఈ సిద్ధాంతం క్రైస్తవ విశ్వాసానికి కేంద్రమైనదని విశ్వసించారు. అందుకే కాల్విన్ భక్తుడు 'నీతిమంతునిగా ప్రకటించడం' అనే సిద్ధాంతం రక్షణ సిద్ధాంతం మొత్తానికి ప్రాముఖ్యమైన భాగం, క్రైస్తవ్యానికి పునాదిలాంటిదని వాదించారు.[1] సంఘ సంస్కరణ వాదులు ఇలా భావించడానికి కారణం లేకపోలేదు. అపరాధియైన పాపి, అనంత నీతి న్యాయవంతుడైన దేవుని యెదుట విడుదల పొంది, ఆయన ఆమోదాన్ని అభిమానాన్ని ఎలా పొందగలడో 'నీతిమంతునిగా ప్రకటించడం' అనే ఈ బైబిల్ సిద్ధాంతం వివరిస్తుంది.

ఈ సిద్ధాంతం 'పాప క్షమాపణ', 'దేవునితో సమాధానపడడం', 'దేవునితో సహవాస పునరుద్ధరణ', 'దేవుని పరిశుద్ధ కుటుంబంలోనికి దత్తత', 'నిత్యజీవం ఎలా సాధ్యమౌతుంది' లాంటి అతి ప్రాముఖ్యమైన దైవశాస్త్ర అంశాలతో ముడిపడి ఉన్న ప్రాముఖ్యమైన సిద్ధాంతం.

పాపం దేవుని ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడంలో వైఫల్యం చెందడమైతే, అపరాధం దేవుడు నిషేధించిన దానిని అతిక్రమించడం. మనుష్యులందరూ అపరాధములను, పాపములను చేసి దేవుని నుండి వేరైపోయారని పౌలు భక్తుడు స్పష్టం చేశాడు (ఎఫెసీ 2:1). మనుషులు కేవలం విఫలులే కాదు దేవుని మీద తిరుగుబాటు చేసినవారు. కాబట్టి మనుష్యులందరూ దేవుడు ఆజ్ఞాపించిన వాటిని చేయకుండా, దేవుడు నిషేధించిన వాటిని చేస్తూ దేవుని న్యాయస్థానంలో నేరస్థులుగా లేక దోషులుగా తీర్పు పొందుతున్నారు. పాపాన్ని ఉపేక్షించి దుష్టుని నిర్దోషి అని ప్రకటించేటంతగా తన నైతిక ప్రమాణాలను మార్చుకోజాలని నీతిగల న్యాయాధిపతి మన ప్రభువు (2 తిమోతి 4:8, నిర్గమ 23:7). కాబట్టి దేవుడు నీతిమంతునితో వ్యవహరించినట్లు శిక్షావిధి క్రింద ఉన్న దుష్టునితో వ్యవహరించలేరు.

సంపూర్ణ నీతి, న్యాయములు గల పరిశుద్ధుడైన దేవుడు అపరాధియైన పాపికి మరి **ఎలా విముక్తి ప్రసాదిస్తారు**? దేవుడు తన నీతి విషయంలో రాజీపడకుండా **దేని ఆధారంగా** అనీతిమంతుడైన పాపిని నీతిమంతునిగా తీర్పు తీరుస్తారు? ఈ పనిని దేవుడు **ఎలా సాధించారు**? నైతిక చట్టాన్ని ఇచ్చిన, ప్రపంచానికి న్యాయాధిపతిగా ఉన్న దేవుని మీద తిరుగుబాటు చేసిన పాపిని **దేని ద్వారా** నీతిమంతునిగా ఎంచుతారు? ఈ ప్రశ్నలు కేవలం దైవశాస్త్ర సంబంధమైనవే కాదు, మనందరి వ్యక్తిగత

జీవితాలకు సంబంధించిన అతి ప్రాముఖ్యమైనవి కూడా.

నీతిమంతునిగా తీర్పుతీర్చడం పాపి విషయంలో తక్షణం జరిగిపోయే సంఘటనా? లేక జీవితాంతం జరిగే ప్రక్రియా? అది ఒక వ్యక్తిని నీతిమంతుడని బాహ్యంగా ప్రకటించడమా? లేక అతన్ని నీతి మంతునిగా తయారు చేయడమా? ఒక వేళ అది ప్రకటించడమే అయితే క్రీస్తు సిలువలో చేసిన పనిని వ్యక్తిగతంగా కేవలం అంగీకరించడం ఆధారంగానా? లేక క్రీస్తు నీతిని విశ్వాసముంచిన వ్యక్తికి ఆపాదించడం మూలంగానా? నీతిమంతునిగా తీర్పు తీర్చడం న్యాయపరమైనది అనే దృక్పథం నైతిక విశృంఖలతకు దారి తీయదా? లాంటి ప్రశ్నలు ఈ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరతని మనకు గుర్తు చేస్తాయి.

## నీతిమంతులుగా ప్రకటించడం - అర్థం

"పాపులను (దుష్టులు, భక్తిహీనులైన మనుషులు - రోమా 4:5, 3:9-24) క్షమిస్తూ, వారిని నీతిమంతులుగా అంగీకరిస్తూ, మునుపు తనతో విముఖతతో ఉన్న సంబంధాన్ని శాశ్వతంగా సరి చేసే దేవుని న్యాయపరమైన కార్యమే నీతిమంతులుగా తీర్పు తీర్చడం." అని నిర్వచిస్తారు జె.ఐ. పేకర్[2]

'శిక్షకు పాత్రుడు' అని తీర్పుచెప్పడానికి బదులుగా దానికి భిన్నమైన తీర్పును న్యాయాధిపతి ప్రకటించే పనినే నీతిమంతులుగా ప్రకటించడం అంటారు (ద్వితీ 25:1; సామె17:15; యెషయా 5:23; యిర్మీయా 3:11; రోమా 8:33).

బైబిల్లో sādēq (Heb) & dikaioô (Greek) క్రియా పదాలకు న్యాయపరమైన అర్థాలు ఉన్నాయి: 'ప్రకటించు', 'అంగీకరించు', లేక 'నీతిమంతులుగా పరిగణించు', 'నీతిమంతులుగా ప్రకటించు'. నేరస్తుడు నిర్దోషి కలసి ఉన్న న్యాయపరమైన సన్నివేశంలో యెహోవా 'నేను దుష్టుని నిర్దోషిగా ఎంచను' అని ప్రకటించారు (declare to be in the right) (నిర్గమ 23:7).

నీతిమంతులుగా తీర్పు తీర్చడంలో ఎవ్వరినీ నీతిమంతులుగా తయారు చేయరు, నీతిమంతులు అని గానీ నేరస్థులని గానీ కేవలం ప్రకటిస్తారు (రోమా 2:13, 8:33-34). "గ్రీకు క్రియాపదం (dikaioô) బైబిల్లో ప్రధానంగా న్యాయపరమైన అర్థంతో వాడడం జరిగింది. అది ప్రాథమికంగా న్యాయపరంగా విడుదల చేస్తూ తీర్పు ప్రకటించడాన్ని సూచిస్తుంది" అంటారు లియాన్ మోరిస్‌గారు.

"దేవుడు తన కృపా వరంగా తనయందు నమ్మికయుంచిన పాపికి సంపూర్ణమైన, పరిపూర్ణమైన క్రీస్తు నీతిని ఆపాదించి, కేవలం విశ్వాసం ద్వారా న్యాయపరంగా తన యెదుట పరిపూర్ణ నీతిమంతులుగా ప్రకటించి, పాపి యొక్క ప్రతి అనీతిని క్షమించి తద్వారా అతన్ని సమస్త నేరారోపణ నుండి విడుదల చేసే దేవుని తక్షణ చర్యే నీతిమంతులుగా ప్రకటించడం" అంటారు మెక్‌ఆర్థర్[3]

అయితే సంఘ సంస్కరణ కాలంలో రోమన్ క్యాథలిక్ థియాలజీకి, ప్రొటస్టెంట్ థియాలజీకి మధ్య వ్యత్యాసానికి, విభజనకు అతి ప్రధానమైన కారణం "నీతిమంతులుగా తీర్పు పొందడమనే సిద్ధాంతం". వాస్తవానికి కేవలం క్రీస్తు ముగించిన పని ఆధారంగానే, కేవలం విశ్వాసం ద్వారా, కేవలం దేవుని కృపచేతనే ఎవరైనా దేవుని యెదుట నీతిమంతులుగా తీర్పు పొందుతారు అనేది మొత్తం ప్రొటస్టెంట్ ఉద్యమ సైద్ధాంతిక సారాంశం. ఇది రోమన్ క్యాథలిక్ సిద్ధాంతమైన "నీతిమంతులుగా తీర్పు పొందడం కేవలం పాపక్షమాపణ కాదు, గానీ అంతరంగపురుషుని పవిత్రీకరణ మరియు పునరుద్ధరణ కూడా" అనే బోధను తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్యాథలిక్ సిద్ధాంతం నీతిమంతులుగా తీర్పుతీర్చడాన్ని, క్రొత్తజన్మ అనుభవాన్ని పరిశుద్ధ పరచడంతో కలగలిపి, లేఖనాలకు అనుగుణంగా లేనిదిగా చేసేస్తుంది.

## విశ్వాసము మరియు క్రియలు

**రోమన్ క్యాథలిక్ దృక్పథం:** విశ్వాసము + క్రియలు ⟶ నీతిమంతులుగా తీర్చడం

**సంఘ సంస్కర్తల దృక్పథం:** విశ్వాసము ⟶ నీతిమంతులుగా తీర్చడం + క్రియలు

Footnotes

1. John Calvin, Institutes of the Christian Religion, ed. John T. McNeil, P-3.2.1 quoted in 40 questions about salvation by Matthew Barrett, p-193.
2. Concise Theology by J.I Packer, Tyndale House Publishers
3. Biblical Doctrine by Mac Arthur, Crossway Publisher, P-587

**ఈ సిద్ధాంతాన్ని బోధించే విషయంలో రోమన్ క్యాథలిక్ సంఘానికి, ప్రొటెస్టెంట్ సంఘాలకు మధ్య తీవ్రమైన వ్యత్యాసాలే ఉన్నాయి.**

| రోమన్ క్యాథలిక్ | ప్రొటెస్టెంట్ |
|---|---|
| ❖ నీతిని విశ్వాసిలో చొప్పించడం ద్వారా జరుగుతుంది. | ❖ నీతిని విశ్వాసికి ఆపాదించడం ద్వారా జరుగుతుంది. |
| ❖ విశ్వాసిని నీతిమంతునిగా రూపాంతరం చెందించడం. | ❖ విశ్వాసి నీతిమంతుడని కేవలం ప్రకటించడం. |
| ❖ నిత్యజీవానికి అర్హమైన మంచి పనులు చేయడానికి విశ్వాసం కృపతో సహకరించడం ద్వారా. | ❖ కేవలం విశ్వాసం ద్వారానే జరుగుతుంది. |
| ❖ విశ్వాసి అంతరంగంలో జరిగే ప్రక్రియ. | ❖ విశ్వాసికి బయట జరిగే సంఘటన. |
| ❖ విశ్వాసి స్వభావం సమూలంగా మార్పుచెందుతుంది. | ❖ దేవుని యెదుట విశ్వాసి స్థానం నీతిమంతునిగా మారుతుంది. |
| ❖ విశ్వాసిలో జరిగేది. | ❖ విశ్వాసి కొరకు జరిగేది. |
| ❖ విశ్వాసి స్థితిలో మార్పు. | ❖ విశ్వాసి స్థానంలో మార్పు. |

నీతిమంతులుగా తీర్పుతీర్చడంలో రెండు దశలు ఉన్నాయి. మొదటిది పాపక్షమాపణ. యేసుక్రీస్తు ప్రత్యామ్నాయ మరణం ఆధారంగా, దేవుడు విశ్వసించినవారిని **'నిర్దోషులు' అని ప్రకటిస్తారు.** వారి కోసం క్రీస్తు శిక్షను భరించారు (రోమా 3:25, 5:9), కాబట్టి వాళ్ళు ఎన్నటికీ శిక్షావిధి క్రింద ఉండరు.

ఇక రెండవ దశలో 'నీతిని ఆపాదించడం'. క్రీస్తు పరిపూర్ణనీతి ఆధారంగా, దేవుడు విశ్వాసులను పూర్తిగా **నీతిమంతులని ప్రకటిస్తారు.** ఆయన క్రీస్తు నీతిని వారికి ఆపాదిస్తారు లేక జమ చేస్తారు. ఈ విధంగా వాళ్ళు వాస్తవంలో నీతిమంతులు కానప్పటికీ, వారిని నీతిమంతులుగా చూస్తారు. ఎందుకంటే క్రీస్తు నీతిని వారికి ఆరోపించడం వల్ల.(రోమా 5:18-19).

## అవరోధాలు

దోషియైన పాపి నీతిమంతుడైన దేవుని యెదుట విడుదల పొంది, ఆయనతో సామరస్యపూర్వక సంబంధం పునరుద్ధరణ జరగడానికి ప్రముఖంగా మూడు ఆటంకాలు ఎదురవుతాయి.

### ఎ. మానవాళి పాపస్థితి

పాపి సమూలంగా పతనమైనవాడు (రోమా 1:28,29; 2 తిమోతి 3:8; 2 పేతురు 2:19). ప్రతి వ్యక్తి దేవుని విరోధిగా (రోమా 5:10, 8:7; కొలస్సీ 1:21), సాతాను సంతానంగా (యోహాను 8:44), దేవుని నుండి వేరైపోయిన వాడుగా (ఎఫెసీ 2:12,13,19), లోక న్యాయాధిపతి యెదుట దోషిగా, నేరస్థుడిగా (రోమా 3:8, 5:16,18) జీవిస్తున్నాడు. ఎంత శ్రద్ధగా ప్రయత్నించినా కూడా దేవుని యెదుట నిర్దోషులుగా తీర్పు పొందలేనంతగా పాపంలో కూరుకొనిపోయి ఉన్నాడు (లూకా 16:14,15; రోమా 10:3).

### బి. దేవుని పరిశుద్ధమైన, నీతియుక్త స్వభావం

నైతిక అపవిత్రత తన దరికి ఏమాత్రం చేరలేనంతగా దేవుడు అతీతుడని, పాపాన్ని ఏవగించుకొనేటంత పరిశుద్ధుడని లేఖనాలు దేవుణ్ణి వర్ణిస్తాయి (హబక్కూ 1:12, 13). సత్యానికి, మంచికి, న్యాయానికి పరిపూర్ణ ప్రమాణం మూర్తిమత్వమే దేవుని నీతి (యెషయా 45:21). అసలు మనుష్యులు దేనికి అర్హులో దాన్ని వారికి అందించడమే ఆయన న్యాయం. న్యాయాధిపతియైన దేవుడు నీతిమంతులకు ప్రతిఫలాన్ని, అవిధేయులకు శిక్షను లోపరహితంగా, నమ్మకంగా ఇస్తారు (కీర్తన 62:12, 2:6-8). దేవుడు తన స్వభావానికి, లక్షణాలకు, వాగ్దానాలకు

దేవుని చేత మానవులందరి ప్రతినిధిగా నియమితుడైన యేసు క్రీస్తు నీతియుక్తమైన జీవితాన్ని జీవించడం ద్వారా, ఆయనతో విశ్వాసం ద్వారా ఐక్యమయ్యే ప్రతి పాపి దేవుని యెదుట నీతిమంతుడని తీర్పు పొందడానికి కారణమయ్యారు. యేసుక్రీస్తు మనుష్యులందరికీ ప్రతినిధి గనుక ఆయన నీతిని విశ్వాసముంచిన పాపుల నీతిగా పరిగణించి వారిని ఉచితంగా (క్రియలు లేకుండానే) నీతిమంతులని దేవుడు ఎంచుతారు (రోమా 1:17, 3:21-22, 5:17, 9:30, 10:3-11). ఈ నీతి విశ్వాసి ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం ద్వారా సాధించిన స్వనీతి కాదు, దేవుడు యేసుక్రీస్తులో అనుగ్రహించే దేవుని నీతి (ఫిలిప్పీ 3:9, 2 కొరింథీ 5:21). అందుకే ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండా విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము అని అంటాడు పౌలు (రోమా 3:28)

అనుగుణంగా, నిలకడగా, మార్పులేకుండా ప్రవర్తిస్తారు (కీర్తన 119:89; మలాకీ 3:6; యాకోబు 1:17). దేవుని నీతిలో మార్పు సంభవించే అవకాశం లేనేలేదు (యెషయ 51:6,8).

### సి. ఏ మాత్రం రాజీ లేని దేవుని నైతిక చట్టం

మన పాపస్థితికి తగినట్లుగా, దేవుడు మన హృదయాలమీద (రోమా 2:14,15), లేఖనాలలో (అ.కా. 7:53; రోమా 2:12) రాసిన తన నైతిక చట్టాన్ని వక్రీకరించలేనంతగా, రద్దుపరచలేనంతగా మార్పులేనివాడు మన దేవుడు. ప్రతి మనిషి ప్రవర్తనను కొలిచే ఉల్లంఘింపరాని ప్రమాణమే దేవుని చట్టం (రోమా 3:31, 13;8-10).

సార్వత్రికమైన పాపం, రాజీలేని దేవుని నైతిక స్వభావం, తప్పించుకోజాలని దేవుని తీర్పు ఈ మూడు సత్యాలు పాపిని దేవుడు నీతిమంతుడని తీర్పుతీర్చడానికి బలమైన అవరోధాలుగా నిలుస్తాయి. అయితే దేవుడు తన పరిశుద్ధత, నీతి న్యాయాలలో ఏమాత్రం రాజీ పడకుండా పాపిని నిర్దోషిగా తీర్పు తీర్చడంలోనే ఆయన సర్వోన్నత జ్ఞానం బయలు పడడం జరిగింది.

## నీతిమంతులుగా తీర్పు తీర్చడానికి ఆధారం

ధర్మశాస్త్రం నెరవేర్చడం ద్వారా దేవుని యెదుట నీతిమంతులుగా తీర్పు పొందగోరేవాళ్ళు కనీసం రెండు విషయాలు చేసి తీరాలి:

1. ఈ దేవుని సృష్టిలో భాగంగా దేవునికి సంపూర్ణ విధేయత చూపించాలి.
2. ఏ ఒక్క విషయంలో అయినా అవిధేయత చూపితే, దేవుని పరిశుద్ధ చట్టాన్ని మీరిన వారిగా సంపూర్ణ శిక్షను అనుభవించాలి (గలతీ 3:10; యాకోబు 3:10; రోమా 2:13, 3:20).

ఈ రెండింటినీ నెరవేర్చడం, రక్షణను ఆశించే వ్యక్తి చేయడం అసాధ్యమైన విషయం. అందుకే కీర్తనాకారుడు 'యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచినయెడల ప్రభువా, ఎవడు నిలు వగలడు?' అంటాడు. యోబు గ్రంథములో 'నరుడు దేవుని దృష్టికి నీతిమంతుడు ఎట్లు కాగలడు? స్త్రీకి పుట్టిన వాడు ఆయన దృష్టికి ఎట్లు శుద్ధుడు కాగలడు? అని బిల్దదు ప్రశ్నించడం చూస్తాము. దేవుని యెదుట నీతిమంతుని స్థానం పొందడానికి పాపి సత్ప్రవర్తన గానీ, ప్రత్యేక అర్హతలు గానీ, మంచి పనులు గానీ, చివరికి అతని విశ్వాసం గానీ ఆధారం కానే కాదు. క్రీస్తు సాధించి ముగించిన పనికి ఏ కొంచెం పాలు అయినా మానవుడు జతచేయాల్సి వస్తే, దేవుడు నీతిమంతుడని తీర్పు తీర్చడం ఏమాత్రం విశ్వాసం ద్వారా కృపచేత కానేకాదు. రక్షణ దేవునికి చెందినది, అది ఆయన వరం (ఎఫెసీ 2:8). రక్షణ పొందడానికి మానవుని విధేయతను సిలువ కార్యానికి జతచేయడం క్రీస్తు మహిమకు గొడ్డలిపెట్టులాంటిది. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రము వలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే అంటారు పౌలు (గలతీ 2:21). అందుకే మానవ విమోచనా ప్రక్రియ అంతటిలో మానవుని తోడ్పాటు కేవలం అతని పాపం మాత్రమే అంటారో భక్తుడు.


దేవుడు తన నీతి న్యాయాలతో రాజీపడకుండా, స్వతహాగా నీతి ఏమాత్రం లేని పాపిని తన యెదుట నీతిమంతుడని తీర్పు తీర్చడానికి ప్రధానంగా రెండు ఆధారాలు క్రీస్తు జీవితంలో మనకు దొరుకుతాయి. యేసు క్రీస్తు మొత్తం జీవితంలో చూపించిన విధేయతని రెండు దృక్కోణాల నుండి చూడాలి:

క్రీస్తు జీవించిన కాలమంతటిలో ఆయన చూపిన క్రియాశీలక విధేయత (active obedience)

తలవంచి సిలువ మరణంలో ఆయన చూపిన నిశ్చేష్ట విధేయత (passive obedience).

### 1. క్రీస్తు ప్రత్యామ్నాయ మరణం

ధర్మశాస్త్రం ప్రకారం చట్టాన్ని అతిక్రమించిన ప్రతి వ్యక్తీ సంపూర్ణ శిక్షను అనుభవించితీరాలి. శిక్షను అమలు చేయకుండా దేవుడు ఏ వ్యక్తినీ నీతిమంతుడని తీర్పుతీర్చలేరు. అందుకే క్రీస్తు శిక్షా సంబంధమైన శాపాన్ని అనుభవిస్తూ మనుష్యులం దరికి ప్రత్యామ్నాయంగా తన శరీరంలో వారి పాపాలను సిలువలో మోశాడు (గలతీ 3:13; 2 పేతురు 2:24). ఒక్క అపరాధం మానవులందరి శిక్షావిధికి ఎలా కారణమయ్యిందో అలానే సిలువలో చూపిన విధేయత వల్ల చేసిన ఒక్క పుణ్యకార్యం మనుష్యులందరికీ జీవప్రదమైన నీతి విధించబడడానికి కారణమయ్యింది (రోమా 5:16-18). సంపూర్ణ విధేయత చూపుతూ సిలువలో క్రీస్తు మరణించడం, ఆయన తండ్రి పట్ల జీవితాంతం చూపించిన విధేయతకు పరాకాష్ట (ఫిలిప్పీ 2:8). సిలువలో క్రీస్తు ప్రత్యామ్నాయ ప్రాయశ్చిత్త మరణం దేవుని ఉగ్రతను చల్లార్చింది, ఆయనే మనుష్యులందరి పాపాలకు శాంతికరమైయున్నాడు (1 యోహాను 2:2). నీతిమంతుడైన క్రీస్తు అనీతిమంతులైన మనుష్యుల్ని దేవుని యొద్దకు తీసుకొని రావడానికి, వారి పాపాల విషయమై ఒక్కసారే శ్రమపడి మరణించారు (1 పేతురు 3:18). తన విషయంలో పాపాల కొరకు బలిని అర్పించవలసిన అగత్యం లేకపోయినప్పటికీ, ప్రజల పాపాల ప్రాయశ్చిత్తం కోసం బలిగా తన ప్రాణాన్ని అర్పించిన ప్రధాన యాజకుడు యేసు క్రీస్తు (హెబ్రీ 7:28).



క్రీస్తు నీతిని పాపికి ఆపాదించడాన్ని కల్వరిలో క్రీస్తు ప్రత్యామ్నాయ మరణంతో జోడించాడు పౌలు భక్తుడు (2 కొరంథీ 5:21). విశ్వాసం ద్వారా యేసుక్రీస్తుతో ఏకమైన పాపులకు వచ్చే శిక్షా సంబంధమైన మరణాన్ని వాళ్ళందరి కోసం ప్రత్యామ్నాయంగా క్రీస్తు సిలువలో మరణం అనుభవించారు. విశ్వాసం ద్వారా యేసుక్రీస్తుతో ఐక్యమైనప్పుడు రెండు బదలాయింపులు జరుగుతాయి. మనందరి పాపాలు క్రీస్తు పాపాలుగా ఎంచడం మొదటి బదలాయింపు. మానవ పాపాలకు రావలసిన న్యాయబద్ధమైన శిక్ష మొత్తాన్ని ప్రత్యామ్నాయంగా క్రీస్తు అనుభవించారు కాబట్టి పాపక్షమాపణ సాధ్యం అయ్యింది.

కేవలం పాపక్షమాపణ ద్వారా ఏ ఒక్కరూ దేవుని యెదుట నీతిమతులుగా తీర్పు పొందలేరని గుర్తించాలి. మనిషి దేవుడు నిర్దేశించిన రీతిలో జీవించకుండా దేవుని యెదుట నీతిమంతుడని తీర్పు పొందడం సాధ్యంకాదు. చేసిన నేరానికి కేవలం శిక్ష అనుభవిస్తే సరిపోదు, జీవితంలో సంపూర్ణ విధేయత చూపడం అనివార్యం. **'పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు** భూమిమీద ఒకడైనను లేడు' (ప్రసంగి 7:20). అందుకే "ఒక వేళ యేసు నేను చేసిన ప్రతి పాపాన్ని తనపై తీసుకొని నా కోసం శిక్ష భరించినా అది నన్ను దేవుని రాజ్యంలోకి చేర్చలేదు. అది కేవలం నన్ను నరకం నుండి బయట పడేస్తుంది. అప్పటికీ నేను నీతిమంతుణ్ణి కాదు. నేను అమాయకుడిని అయినప్పటికీ అది నిజమైన అర్థంలో కానేకాదు. నేను చెప్పుకోవడానికి నాదంటూ ఏ నీతీ లేదు. కేవలం అమాయకత్వం మనల్ని దేవుని రాజ్యానికి చేర్చదని గుర్తుంచుకోండి. అది నీతి వల్లే సాధ్యం అవుతుంది. పాపక్షమాపణలో నా నేరం తొలగడం మాత్రమే జరిగినట్లయితే, నాకు ఇంకా అర్హత లేదు" అని అంటారు ఆర్.సి.స్ప్రోల్[4].

విశ్వాసిగా ఒక వ్యక్తి చూపించే విధేయత అతన్ని దేవుని యెదుట నీతిమంతుడని అర్హత పొందడానికి ఏమాత్రం సరిపోదని, విశ్వాసి చూపించే విధేయత రక్షణ సొంతం చేసుకోవడానికి కాక రక్షణ పొందడంవల్ల వ్యక్తి జీవితంలో స్వాభావికంగా కనిపించే ఆత్మదేవుని ఫలాలని ప్రధానంగా గుర్తిం చాలి. కాబట్టి దేవుణ్ణి సంతృప్తిపరిచే సంపూర్ణ

విధేయతే ఎవరినైనా దేవుని యెదుట నీతిమంతునిగా తీర్పు పొందగలిగేలా చేస్తుంది, అది ఏ విశ్వాసి వల్ల సాధ్యం కాదు, అందుకే విశ్వాసులకు అతీతమైన, తమది కాని నీతి వారికి అనివార్యం.

## 2. క్రీస్తు ప్రాతినిధ్య నీతియుక్తమైన జీవితం

యేసుక్రీస్తు తండ్రి చిత్తాన్ని సంపూర్ణంగా నెరవేర్చారు, తద్వారా తండ్రి పరిశుద్ధతను, నీతిని పరిపూర్ణంగా సాధించారు (మత్తయి 3:15). మాటల్లోను, క్రియల్లోను దేవుని ధర్మశాస్త్రాన్ని పూర్తిగా నెరవేర్చే (యెషయ 53:9) ఒక పరిపూర్ణమైన నీతిమంతుడైన మెస్సీయ్య రాకకోసం ప్రవక్తలు ప్రవచించారు (యెషయ 11:5; యిర్మీయా 23:5,33:15). తండ్రి ఇష్టాన్ని అనుసరించి ప్రవర్తించడం (యోహాను 5:30), తండ్రి చిత్తాన్ని పనిని నెరవేర్చడానికి మాత్రమే యత్నించడం (యోహాను 4:34, 6:38, 17:4), తండ్రికి సంపూర్ణ విధేయత చూపడం (యోహాను 14:31,5:10) ద్వారా క్రీస్తు పరిపూర్ణమైన నీతియుక్త జీవితాన్ని జీవించారు. దేవుని ధర్మశాస్త్రాన్ని త్రికరణశుద్ధిగా నెరవేర్చి, ఆయన సేవకు సంపూర్ణంగా అంకితమైన పరిశుద్ధుడు, నీతిమంతుడు యేసుక్రీస్తు (అ.కా 3:14, 7:52, 22:14, 1 యోహాను 3:7), దేవునికి తనను తాను సంపూర్ణంగా లోబరచుకొన్నారు గనుకనే క్రీస్తు పవిత్రుడిగా, నిర్దోషిగా, నిష్కల్మషుడుగా, పాపులలో చేరకుండా ప్రత్యేకంగా ఉన్నవానిగా ఆయనను హెబ్రీ గ్రంధకర్త పరిచయం చేశాడు (హెబ్రీ 7:26).

దేవుని చేత మానవులందరి ప్రతినిధిగా నియమితుడైన యేసు క్రీస్తు నీతియుక్తమైన జీవితాన్ని జీవించడం ద్వారా, ఆయనతో విశ్వాసం ద్వారా ఐక్యమయ్యే ప్రతి పాపి దేవుని యెదుట నీతిమంతుడని తీర్పు పొందడానికి కారణమయ్యారు. యేసుక్రీస్తు మనుష్యులందరికీ ప్రతినిధి గనుక ఆయన నీతిని విశ్వాసముంచిన పాపుల నీతిగా పరిగణించి వారిని ఉచితంగా (క్రియలు లేకుండానే) నీతిమంతులని దేవుడు ఎంచుతారు (రోమా 1:17, 3:21-22, 5:17, 9:30, 10:3-11). ఈ నీతి విశ్వాసి ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం ద్వారా సాధించిన స్వనీతి కాదు, దేవుడు యేసుక్రీస్తులో అనుగ్రహించే దేవుని నీతి (ఫిలిప్పీ 3:9, 2 కొరింథీ 5:21). అందుకే ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండా విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము అని అంటాడు పౌలు (రోమా 3:28)

దేవుడు క్రీస్తు నీతిని విశ్వాసముంచిన పాపికి రక్షణ వస్త్రాన్ని, నీతి అనే పై బట్టను ధరింపజేసి నీతిమంతుడని న్యాయపరంగా ప్రకటిస్తారు (యెషయ 61:10). అందుకే యేసుక్రీస్తు మనందరి నీతి అయ్యారు (1 కొరింథీ 1:31; యిర్మీయా 23:6, 33:16). క్రీస్తు తండ్రి పట్ల చూపిన సంపూర్ణ విధేయత పాపికి ఆపాదించడం ద్వారా, విశ్వాసముంచిన పాపిని నీతిమంతునిగా ప్రకటించడానికి మార్గం సుగమం అయ్యింది.

"పాపుల పక్షంగా క్రీస్తు తన జీవితంలో ధర్మశాస్త్రానికి సంపూర్ణ విధేయత చూపించి, ఆయన మరణంలో దాని న్యాయమైన శిక్ష భరించారు. క్రీస్తు ధర్మశాస్త్రాన్ని సంపూర్ణంగా నెరవేర్చడం ఆధారంగా దేవుడు విశ్వసించే ప్రతి ఒక్కరికి పాపాన్ని ఆపాదించకుండా క్రీస్తు నీతిని ఆపాదిస్తారు" అని అంటారు బ్రూస్ డెమరెస్ట్[5].

వాస్తవంలో నీతిమంతుడు కాకపోయినా నీతిమంతుడని ప్రకటించడం అనేది 'న్యాయపరమైన కాల్పనికగా' క్యాథలిక్ సంఘం అభ్యంతరాన్ని లేవనెత్తింది. అయితే "దేవుడు వాళ్ళను (పాపులను) నీతిమంతులని ప్రకటిస్తాడు ఎందుకంటే ఆయన వాళ్ళను నీతిమంతులుగా ఎంచుతాడు; వాళ్ళు ధర్మశాస్త్రాన్ని వ్యక్తిగతంగా పాటించారని కాదు (అది తప్పుడు తీర్పు అవుతుంది). అయితే **ధర్మశాస్త్రాన్ని పాటించి వీళ్ళందరికీ ప్రతినిధిగా ఉన్న వ్యక్తితో వీళ్ళు ఐక్యమయ్యారని ఎంచుతాడు కాబట్టి** (అది సత్యమైన తీర్పు)"[6] అని ప్రతిస్పందించారు దైవ శాస్త్ర పండితుడైన జె.ఐ. పేకర్ గారు.

కాబట్టి **యేసుక్రీస్తు జీవిత-మరణాలలో చూపిన విధేయత 'ఆధారం'గా** కాకుండా మరి ఏవిధంగానూ ఏ వ్యక్తీ దేవుని యెదుట నీతిమంతుడని తీర్పుపొందే అవకాశం లేనే లేదు.

**మిగిలినది వచ్చే సంచికలో....**

**- డి. అనిల్ కుమార్,** వైజాగ్

Footnotes

4. Saved from what? By R.C. Sproul, P-96
5. The Cross and Salvation by Bruce Demarest, Crossway publication
6. Evangelical Dictionary of Theology, P-457

ప్రత్యేకం



# క్రీస్తుని ఆస్వాదించడం

"దేవుని మహిమను కనబరచడానికే విశ్వమంతా రూపించబడింది, దానిని చూచి ఆస్వాదించడానికే మనము నిర్మించబడ్డాం" అని జాన్ పైపర్ అనే భక్తుడు అంటాడు. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి" కీర్తనలు 19:1 ద్వారా విశ్వం యొక్క ఉద్దేశం చూస్తాం. "నా మహిమ నిమిత్తము నేను సృజించిన వారిని నా నామము పెట్టబడిన వారినందరిని తెప్పించుము, నేనే వారి ని కలుగజేసితిని, వారిని పుట్టించినవాడను నేనే" యెషయా 43:7లోని ఈ మాటల ద్వారా వ్యక్తుల పట్ల దేవుని ఉద్దేశం ఏంటో తెలుస్తుంది. ఆ మహిమను చూడడానికి, ఆస్వాదించడానికి మనం ఉన్నాం. మానవుని హృదయం యొక్క ప్రగాఢ వాంఛ దేవుని మహిమను తెలుసుకొని దానిని అనుభవించడమే. మనం నిర్మించబడింది అందుకే.

## దేవుని మహిమ అంటే?

మహిమ అనగానే యేసుక్రీస్తు బొమ్మ చుట్టూ ఉండే తెల్లని రింగు అనుకొంటారు లేదా దేవుడు ప్రత్యక్షమైనప్పుడు వచ్చే పెద్ద వెలుగు అనుకొంటారు. మహిమ అంటే "దేవుడు ఏమైయున్నాడో, దేవుడు ఏమి చేయగలడో" అన్న విషయాల మొత్తం. దేవుని మహిమ అంటే అనంతమైన సౌందర్యం, దేవుని అనంతమైన పరిపూర్ణత యొక్క గొప్పతనం. దేవుని ప్రభావం, సామర్థ్యం, ఉనికిని గూర్చిన సత్యం, లోపం లేని గుణగణాలు అన్నీ సంపూర్ణమైనవి, అనంతమైనవి. అయితే ఎవ్వరూ కూడా దేవుని మహిమను మొత్తం అర్థం చేసుకోలేరు. ఊహకు కూడా అందనిది. అయితే ఆయన మహిమను, సత్యాన్ని కొంతమేరకు అర్థం చేసుకోవడానికి దేవుడు మనకు జ్ఞానం ఇచ్చాడు, ఆయన 'కుమారుణ్ణి' ఈ లోకానికి పంపించాడు. కుమారుడి ద్వారా దేవుని గురించిన కొంత సత్యం, మానవ జీవితానికి ఏదైతే అవసరమో అంతవరకు చెప్పబడింది (యోహాను 1:18). ఆయన చెప్పకపోతే మరెవ్వరి కీ తెలియదు.

## యేసుక్రీస్తే దేవుని మహిమ

క్రీస్తు మహిమే దేవుని మహిమ. "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము"... (2 కొరింథీ 4:4). క్రైస్తవ సువార్త మొత్తం 'క్రీస్తు మహిమ" గురించే. "క్రీస్తును క్రైస్తవ్యం నుండి బయటకు తీస్తే, క్రైస్తవ్యం చనిపోయినట్లే" అని చార్లెస్ స్పర్జన్ అనే దైవజనుడు అంటాడు. క్రైస్తవ్యానికి క్రీస్తే కేంద్ర బిందువు గనుక మనం గురిపెట్టి చూడాల్సింది, హత్తుకోవాల్సింది, ఆస్వాదించాల్సింది క్రీస్తునే. యేసుక్రీస్తు ప్రభువు యొక్క గొప్ప వాంఛ - విశ్వాసులు ఆయన మహిమను తెలుసుకొని, దానిని ఆస్వాదించడమే. అందుకే యేసుప్రభువు యోహాను 17:24లో అలాంటి ప్రార్థన చేశాడు. "తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ

నీవు నాకు అనుగ్రహించిన వారును నాతోకూడా ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను". కావున విశ్వాసి అంతిమ లక్ష్యం క్రీస్తు మహిమను చూచి దానిని ఆస్వాదించడమే.

## క్రీస్తును ఆస్వాదించడం వదిలేశాము

మహిమైయున్న క్రీస్తును ఆస్వాదించడం మనం వదిలేశాము. చాలాసార్లు క్రైస్తవులుగా, క్రైస్తవ నాయకులుగా ఇతరులను మెప్పించడం, ఇతరుల ఆమోదం కోసం ప్రయత్నించడం లేక స్వయం తృప్తి కోసం, సంతోషం కోసం బాగా పని చేయడమే ధ్యేయంగా ఉంటుంది. ఆదివారం ఆరాధన, వార కార్యక్రమాలు, బైబిల్ స్టడీస్, రిట్రీట్స్, మీటింగ్స్ ఇలా ఒక యాంత్రిక విధానంలోకి వెళ్ళిపోయాం. ఈ క్రమంలో క్రైస్తవులుగా క్రీస్తుని ఆస్వాదించడం, క్రీస్తులో ఆనందాన్ని వెతకడం అనే అసలైన విషయాన్ని వదిలేశాము. యేసుక్రీస్తుని దేవుడు ఏర్పరచిన రక్షణ విధానంగానే చూస్తాం. రక్షించబడిన మనం 'ఆయనలో సంతోషించడం, ఆయనను సంతోష పెట్టడం, ఆయన ప్రేమను ఆస్వాదించడం, ఆయనను ప్రేమించడం' అనే దృక్పథంతో జీవించడంలో తక్కువ స్పృహ కలిగి ఉంటాం. క్రీస్తుని ఆస్వాదించట్లేదు అంటే ఆయనను సరిగా మనం అర్థం చేసుకోనట్లే, ఆయన ఎవరో మనకు తెలియనట్టే.

## క్రీస్తును ఆస్వాదించడం అంటే?

**ఆయననే ఆస్వాదించడం:** ఆస్వాదించడం అంటే దేవుడిచ్చిన ఆశీర్వాదాలు, చేసిన మేలులు ఆస్వాదించడం కాదు, దేవుణ్ణే ఆస్వాదించడం. ఇదే యోబు గ్రంథంలో దేవునికి, సాతానుకు మధ్య ఉన్న గొప్ప వాదన. యోబు దేవుడిచ్చిన సంపద, ఆశీర్వాదాల కోసం మాత్రమే దేవుణ్ణి ప్రేమించాడా? లేదా దేవుని విలువను బట్టి యోబు దేవుణ్ణి ప్రేమించాడా? దేవుని విలువను బట్టే. దేవునిలోనే సంతృప్తి చెందాడు. అత్యంత ప్రాథమికమైన విషయం ఏంటంటే, దేవున్ని ఆస్వాదించడం అంటే ఆయనను ఒక వ్యక్తిగా ఆస్వాదించడం. ఒక విషయం, లేదా ఒక ఆలోచన లేదా చర్యల నమూనా యొక్క ఆనందాన్ని మాత్రమే కాదు. దేవుడు ఒక వ్యక్తి. ఆయన్ను ఎలా తెలుసుకొంటాము? ఆయన చర్యలు, ఆయన ఆలోచనలు, ఆయన వాక్యంలో తెలియజేయబడిన సత్యాల ద్వారా, వాటి మొత్తాన్ని ధ్యానించడం ద్వారానే.

**ఆయనను చూడడం:** ఆయనని ఎలా ఆస్వాదించగలం అంటే ఆయనను చూడడం ద్వారానే. అంటే మన భౌతిక నేత్రాలతో కాదు మన మనో నేత్రాలతో. దేవుడు మన మనో నేత్రాలను తెరవకపోతే దేవున్ని మనము అర్థం చేసుకోలేము. దేవుడు మన మనో నేత్రాలు రక్షణ సమయంలో తెరుస్తాడు. అప్పుడు ఆయనను కొంతమేరకు అర్థం చేసుకోవడానికి, దేవుణ్ణి తెలుసుకోవాలనే 'ఆశ'ను కలిగి ఉంటాము. ఈ ఆశ బ్రతికిన ఆత్మలో నుండి పుట్టి, క్రీస్తును చూడటం క్రీస్తు వలె మరింతగా మారడానికి దారి తీస్తుంది.

**ఆయనను హత్తుకోవడం:** ఆస్వాదించడాన్ని మరో మాటలో చెప్పాలంటే హత్తుకోవడం, స్వీకరించడం, ఆనందించడం, సంతృప్తి చెందడం, నిధిని పొందడం లేదా అనంతమైన విలువైనదిగా చూడడం. కీర్తనలు 34:8- యెహోవా ఉత్తముడని రుచి చూసి తెలిసికొనుడి. ఇక్కడ మనం దేవుణ్ణి రుచి చూసి తెలుసుకోండి అన్న ఆజ్ఞను చూస్తాం. క్రీస్తును రుచి చూడడమే క్రీస్తుని చూసి ఆస్వాదించడం. క్రీస్తు వాస్తవికంగా ఎలా ఉన్నాడో అలానే చూసి గ్రహించటం, అనుభవించటం. ఆయనను సరిగా చూడకపోవడాన్ని బట్టి సరైన నిబద్ధత క్రీస్తు పట్ల, క్రీస్తు పని పట్ల లేకపోవడానికి గల ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఆయన ఏంటో అనుభవించకుండా, ఆస్వాదించకుండా ఆయన కోసం అద్భుతమైన జీవితాన్ని గడపలేము. రుచి చూసి తెలుసుకొంటే దాన్ని మరలా మరలా కోరుకుంటాం. దానికోసం మన ధనాన్ని, సమయాన్ని, తలాంతులను వెచ్చిస్తాం. మన సమర్పణలో, మన నిబద్ధతలో లోపానికి



కారణం బహుశా మనం క్రీస్తుని ఇంకా అంతగా ఆస్వాదించకపోవడమే! ఆయన ఎంతో అమూల్యమైన నిధి అని రుచి చూడగలిగితే మన విశ్వాస జీవితం ఆనందదాయకంగాను, మన సేవ సమర్పణతో కూడుకున్నదిగాను అవుతుంది. రుచికరమైన బిర్యానీని పక్కన పెట్టుకొంటే ఉపయోగం ఉండదు, దాన్ని ఆస్వాదించినప్పుడే లాభదాయకం. అలాగే నాకు విలువైన నిధి దొరికింది అని చెప్పుకోవడంలో లాభం లేదు. ఆ నిధిని వ్యక్తిగతంగా అనుభవించినప్పుడు, ఆస్వాదించినప్పుడే నాకు లాభం. ఆయనలో ఎంతో అమోఘమైన సంపద, తరగని జీవం ఉంది. దానిని నేను వ్యక్తిగతంగా రుచి చూడాలి, ఆస్వాదించాలి.

## క్రీస్తును ఆస్వాదించడం ఎలా?

వాక్యంలోని క్రీస్తును తదేకంగా చూస్తున్నప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ఆయనను వాస్తవికంగా చూడటానికి, ఆస్వాదించడానికి మనలో పని చేస్తాడు. అయితే ఎక్కడ చూడాలి? దేవుని వాక్యంలోనే. క్రీస్తు గురించి ఉన్న విషయాలన్నీ శ్రద్ధతో చదవాలి. ఎందుకంటే క్రీస్తు గురించి నిష్పాక్షికమైన సత్యం మనసుకు తెలిసినప్పుడు పరిశుద్ధాత్ముడు క్రీస్తును మహిమ పరుస్తాడు. కాబట్టి ఇప్పటి వరకు చూడని విధంగా, వాస్తవికంగా వాక్యంలో యేసుక్రీస్తుని చూడాలి. లోతుగా అర్థం చేసుకోవాలి. బాగా తెలుసు అనుకోవడం కొత్తగా చూడకుండా చేస్తుంది. ప్రతి రోజు నూతనంగా క్రీస్తుని వాక్యంలో చూడడానికి ప్రయత్నం చేద్దాం. ఆయనలో ఆస్వాదించడానికి ఎన్నో విషయాలు ఉన్నాయి. ముఖ్యంగా మనం నిత్యము మనతో ఉండే ఆయన సన్నిధి గురించిన స్పృహ కలిగి ఆస్వాదించడం మనకు భద్రతను ఇస్తూ, పవిత్రత వైపు నడిపిస్తుంది. ఆయన కనికర ప్రేమను ఆస్వాదించడం నిత్యము నన్ను ప్రేమించే కనికరంగల దేవుడు ఉన్నాడన్న ధైర్యాన్ని ఇస్తూ, తిరిగి ఆయన్ని ప్రేమించేటట్లు చేస్తుంది. ఆయన పునరుత్థానాన్ని ఆస్వాదించడం విజయం గురించి భరోసాని ఇస్తుంది.

ఇంకా మనం ఆస్వాదించడానికి యేసుక్రీస్తు దైవత్వం, నరావతారం, ఆయన శ్రమలు, రక్షణ, సిలువ యాగం, ఆయన కోపం, ఆయన విజ్ఞాపన, ఆయన మహిమ, ఆయన రాకడ ఇలా ఎన్నో ఉన్నాయి.

## క్రీస్తును ఆస్వాదించడం వల్ల కలిగే ఫలితాలేంటి?

చాలాసార్లు క్రైస్తవులుగా మనం పరలోకంలో కలగబోయే బహుమానాల గురించిన ధ్యాసే ఉంటుంది. కానీ పరలోకం కోసమైన ఈ ప్రయాణాన్ని మనం ఆస్వాదించము. ఈ ప్రయాణంలో మనతో పాటు ఉన్న క్రీస్తుని ఆస్వాదించము. మనం కొన్న వస్తువుని, చేసుకున్న వంటకాన్ని ఆస్వాదించినప్పుడు వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేము, అలానే మన అమూల్యమైన సంపద అయిన క్రీస్తుని ఆస్వాదించినప్పుడు వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేము, మరి దేనితోను పోల్చలేము. ఆయనను మనం సరిగా అర్థం చేసుకొని, ఆస్వాదించడం ద్వారా మనలో గణనీయమైన మార్పులతో, క్రీస్తు రూపం వైపు అడుగులు పడతాయి. తన జీవిత చరమాంకంలో కూడా క్రీస్తును మరి ఎక్కువగా ఎరగాలని, ఆస్వాదించాలని, అనుభవించాలన్న పౌలు భక్తుని కోరికను మనం ఫిలిప్పీయులకు రాసిన పత్రికలో చూస్తాం. అదే అతనిని దేవుని కోసం జీవించేలా, పనిచేసేలా ప్రోత్సహించింది. ఆస్వాదించడం ద్వారా మనం నెమ్మదిని పొందుతాం, ఆధ్యాత్మికంగా పటిష్టంగా ఉంటాం. ఆస్వాదించడం ద్వారా మనలో రూపాంతరం, శ్రమలు అనుభవించడానికి సిద్ధ మనసు మనలో కలుగుతుంది. దేవునిని ఆస్వాదించడమనేది క్రీస్తును ఉన్నతంగా ప్రేమించడానికి, దేవునిని ఉన్నతంగా ఆరాధించడానికి మూలం. దేవునిలో సంతృప్తి చెందటం, లేక ఆయనను ఆస్వాదించడం ఆరాధనకు మాత్రమే మూలం కాదు గాని త్యాగపూరితంగా పని చేయటానికి కూడా అదే మూలం అవుతుంది.

## ముగింపు

సర్వసంపదలు ఆయనయందు గుప్తమై ఉన్నాయి. కావున జీవితానికి నిజమైన సంతోషం, తృప్తి క్రీస్తులోనే. దేవునిలో తృప్తి చెందడం మన ప్రధాన కర్తవ్యం, ఇది లేకుండా, మన హృదయంలో నుండి దేవుణ్ణి మహిమపరచలేము. "మనం దేవునిలో అత్యధికంగా సంతృప్తి చెందుతున్నప్పుడు మన ద్వారా దేవుడు అత్యధికంగా మహిమ పొందుతాడు" అని పైపర్ అనే దైవజనుడు అంటాడు. గనుక మనం ఆయనను ఆస్వాదించి, ఆయనలో ఎక్కువగా సంతృప్తి చెందినప్పుడు ఆయనకు మహిమ!

– ఏ. శివరామకృష్ణ, స్టాఫ్, పిడుగురాళ్ళ



# అడుగుజాడలు

**(ఎఫెసీ 5:1-10)**

## పరిచయం

ఎఫెసీయులకు రాసిన పత్రిక పౌలు రచించిన చెరసాల పత్రికలలో ఒకటి (ఫిలిప్పీయులకు, కొల స్సీయులకు, ఫిలేమోను పత్రికలతో కలిపి, అపొ. కా. 28వ అధ్యాయం). దాదాపు క్రీ॥శ॥ 67లో తిరిగి బంధించబడక ముందు పౌలును 3 లేక 4 సంవత్సరాలు విడుదల చేశారు, తర్వాత అతడు హతసాక్షి అయ్యాడని చరిత్ర చెప్తుంది.

పౌలు తన 3వ సువార్త ప్రయాణంలో ఎఫెసీ సంఘాన్ని ఎంతో ప్రేమించి ఈ సంఘములో 3 సంవత్సరాలు గడిపాడు. ఈ పత్రిక ఎటువంటి సమస్యను తెలియజేయలేదు గానీ ఆసియా ఖండములో ఉన్న అనేక సంఘములకు పంపబడింది, ఆయా సంఘములలో “ఒక హ్యాండ్ బుక్‌గా” పరిగణించారు.

## పుస్తక విశిష్టత

పౌలు యొక్క ముఖ్యమైన ఉద్దేశము మొదటి మూడు అధ్యాయాల్లో చూడవచ్చు. ఎఫెసీలో ఉన్న క్రైస్తవులు యేసు క్రీస్తులో ఏమైయున్నారో, క్రీస్తులో వారి స్థితి ఏమైయున్నదో, క్రీస్తులో ఆశీర్వాదాలు ఏమైవున్నాయో అనే సత్యాలను చాలా చక్కగా వివరించాడు. అలాగే సరియైన విశ్వాసమును గూర్చి, క్రైస్తవుల వ్యక్తిగత గుణములు తెలిపేది, సంఘము యొక్క కట్టుబాట్లను తెలిపే మంచి పుస్తకం. దీనిలో పౌలు విశ్వాసులకు సలహాలను, ప్రోత్సాహాన్ని, హెచ్చరికలను జారీ చేస్తున్నాడు. ప్రతి విశ్వాసి క్రీస్తులో ఉన్న స్థితిని బట్టి సంతోషించేటట్లు, వారి స్థితి యొక్క సత్యాన్ని తెల ుసుకొనేటట్లు చక్కగా ఈ పత్రికలో వివరించడం జరిగింది.

## రచయిత, రచనా కాలము

అపోస్తలుడైన పౌలు రోమా చెరసాలలో ఉన్నప్పుడు క్రీ॥శ॥ 60-62 రాశాడని చరిత్ర చెబుతుంది (1:1, 3:1, అపొ.కా. 28:16-31)

## నేపథ్యం

ప్రపంచంలో పేరు ప్రఖ్యాతి గాంచిన వాళ్ళను, సమర్థులను, నిపుణులను, ఎవరైనా అనుకరించడానికి, వాళ్ళతో గుర్తించబడడానికి ఆసక్తి చూపడం సహజమే. అయితే మనలను సృష్టించిన సృష్టికర్తను, పరిశుద్ధుడు, ఎవరు సాటిరాలేని దేవుని పోలి జీవించడం అంటే అది అద్భుతమైన ఆధిక్యత.

## ప్రశ్నలు

1. పిల్లలు సాధారణంగా తమ తల్లిదండ్రుల నుంచి మంచి విషయాలను ఎలా నేర్చుకుంటారు?
2. పౌలు ఈ భాగంలో దేవుని బిడ్డలను ఎలా సంబోధించాడు? (5:1,3,10)
3. క్రీస్తు బిడ్డలు పోలి నడుచుకోవలసిన అంతిమ మాదిరి ఎవరు. ఏ కారణాలను బట్టి మనం అలా చేయాలి? (5:1,2 వచ)
4. యేసు తన ప్రేమను ఎలా వ్యక్తం చేశాడు? (2వ). దానిని మన అనుదిన జీవితంలో ఆచరణలో ఎలా చూపగలం?
5. ఈ భాగంలో ఇవ్వబడిన పాపాల జాబితా ప్రభావం క్రీస్తును నమ్మిన వ్యక్తులపై ఉంటుందా? ఎందుకు (3,4 వచ)
6. విశ్వాసిగా నీ ప్రవర్తన, సంభాషణ విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? (4,6 వచన)
7. నీ మాటలు స్నేహితులు, కుటుంబం, ఇరుగు పొరుగు వారు, అధికారులు మొదలైన వారిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయి?
8. కొన్ని నిర్దిష్ట పాపాలు చేసే వాళ్ళ గమ్యం ఏంటి? దానికి కారణం వివరించు.
9. యేసుకు ఇష్టమైన జీవితం జీవించినప్పుడు ఎటువంటి ఫలాలు ఫలిస్తుంది? (8-10 వచ)

– విజె డెస్క్

కవిత

# సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ



సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
నీతో కూడ మరణించిన హృదయాన్ని నాకివ్వు
దేవునిలో జీవిస్తున్న జీవితాన్ని నాకివ్వు ప్రభూ
నీ రక్తంతో పవిత్రపరచబడిన జీవితాన్ని నాకివ్వు

స్వార్థం చచ్చిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
ఈ లోకానికి చచ్చిన హృదయాన్ని నాకివ్వు
అహానికీ ఆశలకూ చచ్చిన హృదయాన్ని నాకివ్వు
స్వయం, స్వచిత్తం చచ్చిన హృదయాన్ని నాకివ్వు

నా పాత స్వభావాన్ని నీ సిలువలో వ్రేలాడదీయండి
నేనీలోకాన్ని పెంటలా ఎంచుకొనేలా చేయడి
లోకాశలన్నీ చచ్చిపోయేంతగా నన్ను పవిత్రపరచండి
లోకానికి చచ్చినంతగా నన్ను పరిశుద్ధపరచండి

సిలువ వేయబడిన వినయ మనస్సును నాకివ్వు
సున్నితమైన కరుణగలిగిన మనస్సును నాకివ్వు
సిలువ వేయబడిన స్వచ్ఛమైన మనస్సును నాకివ్వు
నీ ప్రతి పిలుపుకు ప్రతిస్పందించే మనస్సును నాకివ్వు

నా ఆశలు ఆశయాలు సిలువ వేయబడును గాక
నా ప్రేమ పరిపూర్ణత స్థాయికి చేరుకొనును గాక
నన్ను నా సమస్తాన్ని సిలువకు మేకులతో కొట్టు
నన్ను పూర్తిగా నీ కొరకై సిలువలో సరిదిద్దు

ప్రభూ, నీ మరణం నిరంతరం నాలో ఉండనివ్వు
నా స్వయాన్ని పూర్తిగా సిలువ మేకులకు బంధించు
ప్రతి క్షణం సిలువ వేయబడిన అనుభవం నాకివ్వు
నా స్వరూపాన్ని పూర్తిగా నీ సారూప్యంలోకి మార్చు

– వెస్లీ డ్యూయల్




# నైపుణ్యాల్ని అభివృద్ధి చేసుకొందాం

నైపుణ్యం (Skill) అనే పదానికి రెండు వేర్వేరు అర్థాలు ఉన్నాయి. ప్రావీణ్యం (expertise), సామర్థ్యం (ability). ఈ రెండింటి మధ్య తేడాను వివరించడానికి నేను ఒక ఉదాహరణను తెలియజేస్తాను. దేవరాజ్ అన్న ప్రావీణ్యం ఉన్న గాయకుడు, సంగీతకారుడు. నాకు పాటలు పాడే సామర్థ్యం (ability) తో పాటు డ్రమ్స్ వాయించే సామర్థ్యం కూడా ఉన్నది. అయితే, వీటిలో నాకు సామర్థ్యం ఉంది కాని ప్రావీణ్యం లేదు. మొదటి విషయం "శ్రేష్ఠత" (excellence) కు సంబంధించినది. "సామర్థ్యం" అను అర్థమిచ్చే రెండవ విషయాన్ని మనం క్షుణ్ణంగా అధ్యయనం చేద్దాం. ఈ 'సామర్థ్యం' అనే పదానికి నైపుణ్యం అనే పదాన్ని కూడా వాడవచ్చు.

సొలొమోను దేవాలయాన్ని నిర్మిస్తున్నాడు. ఇత్తడి పనులను నైపుణ్యంగా చేయగలిగిన ఒక వ్యక్తి అతనికి అవసరమై తూరు పట్టణము నుండి హీరామును పిలిపించాడు. దానియేలు, అతని ముగ్గురు స్నేహితులు జ్ఞాన వివేకముల సంబంధమైన ప్రతి విషయంలో శ్రేష్ఠులుగా ఉన్నారని దానియేలు గ్రంథం మొదటి అధ్యాయంలో ఉన్నది. మనకు నైపుణ్యం ఉంటే మనల్ని దేవునితోపాటు మనుష్యులు కూడా ఉపయోగించుకొంటారు.

కొన్నిసార్లు మనం నైపుణ్యం/సామర్థ్యం, సహజ సిద్ధమైన తలాంతు, ఆత్మవరం అనే పదాలను సమానార్థాలుగా ఉపయోగిస్తుంటాము. అయితే, వీటి మధ్య కొంత తేడా ఉన్నది.

**ఆత్మ వరాలు:** ఆ పేరులోనే ఉన్నట్లుగా, ఒక వ్యక్తి మారుమనసు పొందిన తర్వాత పరిశుద్ధాత్మ ద్వారా దేవుడు ఆ విశ్వాసికి వీటిని అనుగ్రహిస్తాడు. ఇవి విశ్వాసులకు మాత్రమే. ఉదా: ప్రవచనం (1 కొరింథీ 12:8-10).

**సహజసిద్ధమైన తలాంతులు:** జన్మత: దేవుడు కొన్ని సామర్థ్యాలు ఇస్తాడు. ఇవి విశ్వాసులలోను, అవిశ్వాసుల లోను ఉంటాయి. ఉదా:పాటలు పాడడం.

**నైపుణ్యాలు:** వీటిని సామర్థ్యాలు అని కూడా మనం పిలుస్తుంటాము. శిక్షణ, అభ్యాసం, అధ్యయనం, తల్లిదండ్రుల పెంపకం ద్వారా ఇవి లభిస్తాయి. ఉదా: ఆంగ్ల భాషలో మాట్లాడడం.

ఈ వ్యాసంలో మనం నైపుణ్యాలు, తలాంతులు గూర్చి మాత్రమే తెలుసుకోబోతున్నాం. ఈ వ్యాసంలో ఆత్మవరాల వివరణను మనం చూడబోవడం లేదు.

## నైపుణ్యాలకు ఉదాహరణలు

పాటలు పాడడం, ఆంగ్లభాష మాట్లాడడం, భావ ప్రకటన నైపుణ్యాలు (మాట్లాడటం/రాయడం), బోధించటం, ఆటలు ఆడటం, సంగీత వాయిద్యాలు వాయించడం, ఇతరులను అర్థం చేసుకోవడం, ఓర్పు, వంట చేయడం, మెకానిక్, పెయింటింగ్, పారిశ్రామిక నైపుణ్యాలు (ఉదా: కెమిస్ట్, ఎలక్ట్రికల్ నైపుణ్యం మొ॥నవి), గ్రూప్‌వర్క్, సమస్యలను పరిష్కరించడం, సృజనాత్మకత, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, క్రమశిక్షణతో కూడిన జీవితం, కంప్యూటర్ స్కిల్స్, మార్కెటింగ్ స్కిల్స్, కార్యక్రమాలను సమన్వయం చేయడం లేదా సమర్థవంతంగా నిర్వహించడం, క్లిష్టపరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడం, చరిత్రకు సంబంధించిన జ్ఞానాన్ని కలిగియుండడం మొ॥నవి.

పైన తెలిపిన నైపుణ్యాలలో కొన్ని ఆత్మవరాల జాబితాలో ఉండే అవకాశం ఉంది. కాబట్టి, జన్మత: దేవుడు మనకు ఒక తలాంతు ఇస్తే, దాన్ని ఒక నైపుణ్యంగా మనం అభివృద్ధి చేసుకొంటే, తర్వాత పరిశుద్ధాత్మ దేవుడు ఆ నైపుణ్యానికి సంబంధించిన ఒక వరాన్ని మనకు అనుగ్రహిస్తే, ఈ రెండింటి

మేళవింపు ద్వారా వచ్చే ఫలితం అద్భుతంగా ఉంటుంది. ఉదా: బోధించడం.

## సామర్థ్యాల్లో రకాలు

**1. సాఫ్ట్ స్కిల్స్ మరియు హార్డ్/టెక్నికల్ స్కిల్స్**: సాఫ్ట్ స్కిల్స్ అనేవి భావోద్రేక సంబంధమైన సామర్థ్యాలు, సహజసిద్ధంగా వచ్చే సామర్థ్యాలకు సంబంధించినవి. ఇతరులతో మంచిగా సంభాషించడానికి, స్నేహ సంబంధాలను ఏర్పరచుకొనుటకు ఇవి మనకు సహాయపడతాయి. పరిశ్రమలు, ఉద్యోగాలలో ఇవి ఉపయోగపడతాయి. ఉదా: భావ వ్యక్తీకరణ. మరొక ప్రక్క హార్డ్ స్కిల్స్ సాధారణంగా ఒక పనికి సంబంధించినవి. అధ్యయనం, శిక్షణల ద్వారా వీటిని పెంపొందించుకోవచ్చు. వీటిని టెక్నికల్ స్కిల్స్ అని కూడా పిలుస్తారు. ఉదా: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్.

**2. జన్మత: మరియు శిక్షణ:** పుట్టుకతోనే మనకు వచ్చే సహజసిద్ధమైన తలాంతును సానబెట్టుకొని దానిని ఒక నైపుణ్యంగా మార్చుకోవచ్చు. దీనిని తలాంతు ఆధారిత నైపుణ్యం అని అంటారు. ఉదాహరణకు, ఒక అబ్బాయికి డ్రమ్స్ వాయించే నైపుణ్యం ఉంది. పుట్టుకతోనే అతనికి సంగీతం పట్ల ఉన్న తలాంతు ఆధారంగా ఈ నైపుణ్యం అతనిలో అభివృద్ధి చెందింది. తలాంతు ఆధారితం కాని నైపుణ్యం అనేది కేవలం శిక్షణ ద్వారా వచ్చే నైపుణ్యం. ఉదాహరణకు, ఆంగ్ల భాష మాట్లాడే నైపుణ్యం. ఇది పుట్టుకతో ఉన్న తలాంతు ఆధారంగా వచ్చిన నైపుణ్యం కాదు.

**3. మనకు ఇష్టమైనవి, ఇష్టం లేనివి**: ఆర్.సి. స్ప్రౌల్ చెప్పినట్లుగా కొన్ని నైపుణ్యాలను మనం ఇష్టంతో అభివృద్ధి చేసుకొంటాము. ఉదాహరణకు, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నైపుణ్యం నాకు ఉన్నది. దాన్ని ఇంకా అభివృద్ధి చేసుకోవాలనే కోరిక నాకు ఉన్నది. దాన్ని ఉపయోగించడం ఇంకా కొనసాగించాలనే కోరిక కూడా నాకు ఉన్నది. మనలో కొన్ని నైపుణ్యాలు ఉంటాయి. అయితే, వాటిని అభివృద్ధి చేసుకోవడం మనకు ఇష్టం ఉండదు. ఉదా: ఒక యవ్వనస్తునికి గోల్ఫ్ ఆడే నైపుణ్యం చాలా ఉన్నది. అయితే, ఆ ఆటను ఆడడం అతనికి ఏమాత్రం ఇష్టం లేదు. ఈ రెండు విషయాలను ఆధారం చేసుకొని, నైపుణ్యాలను మనం రెండు రకాలుగా విభాగించవచ్చు. ప్రేరేపిత నైపుణ్యాలు (మనం ఇష్టపడి అభివృద్ధి చేసుకొనేవి, వాడేవి), ప్రేరేపితం కాని నైపుణ్యాలు (సామర్థ్యం మనకు ఉన్నా, వీటి పట్ల అయిష్టత వలన వీటిని అభివృద్ధి చేసుకోము, వాడుకోము).

**4. దేవుని పిలుపుకు అనుగుణంగా ఉన్నాయా లేవా?**: నైపుణ్యాల గూర్చి మనం ఆలోచించాల్సిన మరొక కోణం, మనం అభివృద్ధి చేసుకోవాలనుకుంటున్న నైపుణ్యాలు దేవుడు మనకు ఇచ్చిన పిలుపుకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని. దేవుడు మనల్ని ఒక విషయం కోసం పిలిస్తే, దానికి సంబంధించిన నైపుణ్యాలను మనం ఖచ్చితంగా అభివృద్ధి చేసుకోవాలి. పిలుపు కేంద్రితమైన నైపుణ్యాలుగా మనం వీటిని పిలవొచ్చు. కొన్ని సందర్భాల్లో మనలోని ప్రేరేపితం కాని నైపుణ్యాలు మన పిలుపుకు అవసరమై ఉండే అవకాశం ఉంది. అలాంటి సందర్భాలలో, మన ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి, దేవుని పిలుపుకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. ఉదాహరణకు, పియానో వాయించే నైపుణ్యం ఒక యవ్వనస్థునికి ఉంది. అయితే, ఆ నైపుణ్యాన్ని ఉపయోగించడం అతనికి ఇష్టం లేదు. అయితే, క్రిస్మస్ పాటల బృందంలో ఉండాలనే పిలుపును దేవుడు అతనికి ఇస్తే, పియానో వాయించే తన నైపుణ్యాన్ని దేవుని మహిమార్థం అతను తప్పనిసరిగా ఉపయోగించాలి. కొన్ని ప్రేరేపిత నైపుణ్యాలు దేవుని పిలుపుకు కొన్ని సందర్భాలలో వాటిని మనం నిరుపయోగంగా ఉంచాల్సి వస్తుంది. ఉదాహరణకు, నాకు చెస్ ఆడే నైపుణ్యం ఉంది. అయితే, నేను దాన్ని దాదాపు ఉపయోగించను. ఎందుకంటే, నా పిలుపుకు అది సరిపోదని నేను నమ్ముతాను.

ఒక నైపుణ్యం దేవుని పిలుపు ఆధారితమై, దాన్ని అభివృద్ధి చేసుకున్నప్పుడు ఆ నైపుణ్యం దేవునికి, సమాజానికి ఉపయోగపడుతుంది. లౌకిక సంబంధమైన ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు దేవుని పిలుపులో భాగం కాదని కొంతమంది భావిస్తారు. దేవుని వాక్యాన్ని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, మన ఉద్యోగం, కుటుంబ బాధ్యత, పరిచర్య... ఇలా ప్రతీది దేవుని పిలుపులో భాగమేనని మనకు అర్థమవుతుంది. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నైపుణ్యం నాకు ఉన్నది. అది పిలుపు కేంద్రితమైన నైపుణ్యం. ఎందుకంటే ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా, ఒక తండ్రిగా, ఒక భర్తగా, ఒక బైబిల్ బోధకునిగా, ఒక సౌవార్తికునిగా ఉండడానికి దేవుడు నన్ను పిలిచాడని నేను నమ్ముతున్నాను.

మ్యాథమ్యాటిక్స్‌ను బోధించే సామర్థ్యం నాకు ఉన్నది. దీన్ని ఒక తంత్రిగా నేను ఉపయోగిస్తున్నాను. ఇది కూడా పిలుపు ఆధారిత నైపుణ్యమే.

## నైపుణ్యాలను గుర్తించడం

1. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో మొదటి సోపానం, మనకు పుట్టుకతో వచ్చే తలాంతులను, ఇప్పటికే ఉన్న సామర్థ్యాలను గుర్తించడం. కాబట్టి ఒక పెన్ను, ఒక పేపరు తీసుకొని నీకు ఉన్న నైపుణ్యాలన్నిటిని రాసుకో. నీ సన్నిహితులను సంప్రదించి, వారి అభిప్రాయన్ని కూడా తీసుకో. ఎందుకంటే మనలో ఉన్న నైపుణ్యాలను మనకన్నా, ఇతరులే తరచుగా గుర్తిస్తుంటారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో మరొక భాగం, దేవుడు మనకు ఇచ్చిన పిలుపుకు అనుగుణంగా దేవుని సేవించడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం. ఉదాహరణకు, ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉండడానికి దేవుడు నన్ను పిలిస్తే, నేను మంచి ఆంగ్ల భాషా నైపుణ్యాలను సంపాదించుకోవాల్సిన అవసరం ఉన్నది. మనం పై రెండు విషయాలను పూర్తిచేసిన తర్వాత, మనకు ఉన్న నైపుణ్యాలు ఏంటి, మనం అభివృద్ధి చేసుకోవాల్సిన నైపుణ్యాలు ఏంటి అనే రెండూ కలిసిన పట్టిక మన వద్ద ఉంటుంది.

పైన చెప్పిన విధంగా మన నైపుణ్యాలను గుర్తించే సమయంలో మనకు ఒక సమస్య ఎదురవుతుంది. అది ఏమిటంటే, మనకు ఇదివరకే ఉన్న నైపుణ్యాలను గుర్తించలేకపోవడం మూలంగా వాటిని పట్టికలో రాయలేకపోవడం. దీనికి కారణం ఏంటంటే, మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకొని, ఒక నైపుణ్యం విషయంలో మనం ఇతరులకన్నా తక్కువ వారంగా ఎంచుకోవడం. నీకు ఉన్న ఏ నైపుణ్యాన్ని తీసుకున్నా, ఆ నైపుణ్యం విషయంలో మనకన్నా ఎక్కువ నైపుణ్యంతో ఉన్నవారు కనిపిస్తూనే ఉంటారు. ఇలా ఉన్నంత మాత్రాన ఆ నైపుణ్యం మనలో లేదనుకోకూడదు. ఒక కారు మెకానిక్ కన్నా నేను మంచిగా పాడగలనని చెప్పగలను. నా నైపుణ్యాల జాబితాలో పాటలు పాడడాన్ని ఒక నైపుణ్యంగా నేను వ్రాసుకొంటాను.

2. మన నైపుణ్యాలను గుర్తించిన తర్వాత 1-10 పాయింట్స్ ఇస్తూ వాటి ప్రాముఖ్యతను గుర్తించాల్సిన అవసరత ఉన్నది (10 పాయింట్స్ ఉంటే చాలా ప్రాముఖ్యం, 1 పాయింట్ ఉంటే అసలు ప్రాముఖ్యమే కాదు). ఇలా ప్రాముఖ్యమైన నైపుణ్యాలను గుర్తించాలి. వీటి ప్రాముఖ్యతను గుర్తించడంలో 'పిలుపు' కీలకమైనది. ఒక నైపుణ్యం నీకు ప్రాముఖ్యం కావచ్చు, మరొకటి నాకు ప్రాముఖ్యం కావచ్చు. దేవుడు మనల్ని దేనికోసం పిలిచాడు అన్న దాన్ని బట్టి ఇది ఆధారపడి ఉంటుంది. రెండవ విషయం, పట్టికలో మన నైపుణ్యాల స్థాయిని (ప్రావీణ్యతను) గుర్తించడం (10 పాయింట్స్ ఉంటే ఈ నైపుణ్యంలో నాకు ప్రావీణ్యత ఉన్నది. 1 పాయింట్ ఉంటే, ఒక నైపుణ్యం విషయంలో నాకు అసలు ప్రావీణ్యత లేదు). ఉదాహరణకు, ఒక వ్యక్తి తయారు చేసుకున్న ఈ క్రింది పట్టికను గమనించండి.

| నైపుణ్యం | ప్రాముఖ్యత | నా స్థాయి |
|---|---|---|
| ఆంగ్లభాష | 9 | 6 |
| తెలుగు భాష | 8 | 10 |
| కంప్యూటర్ ప్రోగ్రామింగ్ | 7 | 5 |
| విశ్లేషణాత్మక నైపుణ్యాలు | 8 | 9 |
| కంప్యూటర్‌ను రిపేరు చేయుట | 4 | 2 |

ఈ పట్టిక ఆధారంగా ప్రాముఖ్యమైన, స్థాయి తక్కువగా ఉన్న రెండు నైపుణ్యాలను తీసుకొని, రాబోయే కొన్ని నెలల్లో వాటిని అభివృద్ధి చేసుకోవాలి. కాబట్టి, పైన తెలిపిన పట్టికలో నుండి ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నైపుణ్యాన్ని తీసుకొని, వాటిని ఆ వ్యక్తి అభివృద్ధి చేసుకోవడం ప్రారంభించాలి.

## నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం

ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కింద తెలిపిన విషయాలు నీకు సహాయపడతాయి. ఈ సలహాలు సర్వసాధారణమైనవి కాబట్టి, వీటితో పాటు నీ పరిస్థితులకు తగినట్టుగా నీవు స్వంతగా ప్రణాళికలు చేసుకోవచ్చు.

**1. మన అత్యున్నతమైన బోధకుడు దేవుడే:** మనం ఆయన మీద ఆధారపడాల్సిన అవసరం ఉంది. ఆయన మనకు ఒక పిలుపు ఇచ్చాడు. ఆ పిలుపుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి

కూడా ఆయనే సహాయం చేస్తాడు. ఉదాహరణకు, బెసలీలు, అహోలీయాబులను ప్రత్యక్షపు గుడారపు నిర్మాణ పనులలో దేవుడు వాడుకున్నాడు. జ్ఞాన విద్యా వివేకములు, సమస్తములైన పనుల నేర్పు వారికి కలుగునట్లు వారిని ఆత్మపూర్ణులుగా దేవుడు చేశాడు (నిర్గమ 31:1-11). ఇంకొక విధంగా చెప్పాలంటే, బెసలీలు, అహోలీయాబులకు దేవుడు సహజ సిద్ధమైన తలాంతులను ఇవ్వడం మాత్రమే కాదు, ఆ తలాంతులను దేవుని పని కోసం ఉపయోగపడేటట్లుగా వాటిని నైపుణ్యాలుగా అభివృద్ధి చేసుకోవడంలో కూడా దేవుడు సహాయం చేశాడు. చివరిగా, ఆత్మతో నింపాడు. ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోలేనని ఎన్నడూ అనుకోవద్దు. అభివృద్ధి చేసుకోవడానికి దేవుడు నిన్ను పిలిస్తే, ఆ విషయంలో దేవుడే నీకు సహాయం చేస్తాడు. నేను గ్రామీణ ప్రాంతం నుండి వచ్చాను, నేను ఆంగ్ల భాషను మాట్లాడలేను అని నీవు అనుకోవద్దు.

**2. ఒక్కొక్క అడుగు**: నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో మనం ఒక చిన్నపాటి స్మార్ట్ గోల్‌తో సిద్ధపడాలి. దీనికి ఉదాహరణ: రాబోయే 4 నెలల కాలంలో వ్యాకరణ దోషాలు లేకుండా నేను ఆంగ్లభాషను రాయగలగాలి. ఈ లక్ష్యాన్ని సాధించిన తర్వాత మరో రెండు నెలల కాలానికి "వేగంగా చదవడం" అనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

**3. ఒక మంచి ఉపాధ్యాయునితో పనిచేయడం**: సాధ్యమైతే ఒక మంచి ఉపాధ్యాయుణ్ణి గుర్తించి, అతని వద్ద శిక్షణ తీసుకోవాలి. మంచి పుస్తకాలు, ఇంటర్నెట్ సహాయంతో మనం స్వంతగానైనా కృషి చేయవచ్చు.

**4. ఒక మార్గదర్శకుణ్ణి కలిగియుండడం**: నైపుణ్యం విషయంలో అప్పటికే ప్రావీణ్యం కలిగియున్న ఒక సీనియర్ విద్యార్థి లేదా గ్రాడ్యుయేట్‌ను గుర్తించి, వారి సూచనలు, సవరణలను తీసుకోవాలి. కొన్నిసార్లు బోధకుడు, మార్గదర్శకుడు ఒకరే అయి ఉండే అవకాశం ఉంది.

**5. అభ్యాసం**: ఒక వ్యక్తి ఇలా అన్నాడు: నీటిలో దిగకుండా ఈత ఎవ్వరు నేర్చుకోలేరు. ఆ నైపుణ్యాన్ని పదే పదే మనం అభ్యాసం చేయాలి. ప్రారంభంలో మనం కొన్ని తప్పులు చేసే అవకాశం ఉంది. అయితే, వాటి నుండి పాఠాలు నేర్చుకుంటూ మనం ముందుకు వెళ్తుండాలి.

**6. కాలనిర్ణయ పట్టిక, కష్టపడి పనిచేయడం**: మన జీవితం పట్ల మనకు ఒక కాలనిర్ణయ పట్టిక ఉండాలి. ప్రాముఖ్యమైన కార్యక్రమాలన్నిటికీ మనం సమయం కేటాయించాల్సిన అవసరం ఉంది. అయితే, మన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి కూడా మనం సమయం కేటాయించుకోవాలి. కష్టపడి పని చేయడానికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. నా ఆంగ్ల భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొన్న నా కళాశాల రోజులు నాకు గుర్తుకొస్తున్నాయి. నేను కష్టపడి పనిచేసేవాణ్ణి, పుస్తకాలు చదివేవాణ్ణి, ఇంగ్లీషు వినేవాణ్ణి, అభ్యాసం చేసేవాణ్ణి (కొన్ని తప్పులు మాట్లాడుతున్నప్పటికీ). ఈ విషయం కోసం ఎంతో సమయాన్ని వినియోగించేవాణ్ణి. మన సమయం, శక్తి వినియోగించకుండా నైపుణ్యాలను మనం అభివృద్ధి చేసుకోలేము.

## దేవుని మహిమ కోసం నైపుణ్యాలను ఉపయోగించడం

ఇంతకుముందు తెలియజేసిన విధంగా, మనం నైపుణ్యాలను స్వార్థం కోసం కాకుండా, దేవుని మహిమ కోసం ఉపయోగించాలి. జీతం సంపాదించడం కోసం మన నైపుణ్యాలను ఉపయోగించకూడదు అని కాదు నా భావం. జీతం సంపాదించడం అనేది దేవుని పిలుపులో ఒక భాగం. పేరు ప్రఖ్యాతులు, గౌరవ మర్యాదల కోసం ఉపయోగించకూడదు. వాటిని బట్టి గర్వించకూడదు. ఒక పనిలో సామర్థ్యం ఉంటే సరిపోదు. దేవుడు మనల్ని దేనికోసం పిలిచాడో ఆ విషయంలో మనం ప్రావీణ్యం సంపాదించాలి. ప్రావీణ్యం సంపాదించి, దేవునికి మహిమ తీసుకురావాలి. సంఘ (ఇతరుల) క్షేమాభివృద్ధి కోసం మన నైపుణ్యాలను ఉపయోగించాలి. దేవుడు తన పిల్లల ద్వారా ప్రజలకు సేవ చేస్తాడు. దేవుని పిల్లలు పరిశుద్ధాత్మతో నింపబడి, దేవుడు తమకు ఇచ్చిన నైపుణ్యాలను ఉపయోగిస్తూ, అభివృద్ధి చేసుకొంటూ, దేవుని ఆత్మచేత నింపబడుతూ, దేవుని మహిమకోసం ఉపయోగిస్తూ ఉంటే దేవుడు ఎంతో సంతోషిస్తాడు ఇలా అంటాడు: భళా, నమ్మకమైన మంచి దాసుడా! నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటి మీద నియమించెదను. నీ యజమానుని సంతోషములో పాలు పొందుము".

**- యం. కోదండరామ్,** హైదరాబాద్



# నిలకడగా కొనసాగెదవా...

రాత్రి 10 గం||లు. అన్ని పనులు ముగించుకొని నిద్రపోయే ముందు కనీసం ఒక గంట అయినా ఫోన్ చూడక పోతే అదో పెద్ద పాపంలా ఫీల్ అయ్యేవారు సుధాకర్, వినయ్, శ్రీకాంత్‌లు. ఇది వారి జీవనశైలి. సుధాకర్ దసరా సెలవుల్లో జరిగిన డిటి క్యాంప్‌కు వెళ్ళొచ్చాడు. అప్పటి నుండి సుధాకర్ జీవితం మారింది. ఉదయాన్నే అందరికంటే ముందే నిద్రలేచి బైబిల్ చదువుకోవడం, ప్రార్థన చేసుకోవడం, టైమ్‌కి కాలేజీకి వెళ్ళడం, రాత్రి పండుకోబోయే ముందు మోకరించి ప్రార్థన చేసుకొని పండుకోవడం, అదీ ఫోన్ చూడకుండా పండుకోవడం, వినయ్‌కి, శ్రీకాంత్‌కి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ సుధాకర్ గాడికి ఏమయ్యింది? మూడు రోజుల క్యాంప్‌కే అంత మార్పా? ఎంతకాలమో చూద్దాం అంటూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకొన్నారు తన రూమ్మేట్స్ వినయ్, శ్రీకాంత్‌లు.

వారం రోజుల తర్వాత, వినయ్, శ్రీకాంత్ ఉండలేక ఆ రోజు రాత్రికి సుధాకర్‌తో మాట్లాడాలని నిర్ణయించుకొన్నారు.

శ్రీకాంత్, సుధాకర్‌తో "అరేయ్, నీలో ఇంత మార్పు ఎలా వచ్చింది? చాలా మంచిగా, పద్దతిగా ఉంటున్నావు" అంటూ అడిగాడు.

సుధాకర్, "నా గొప్పతనం ఏమి లేదురా, డిటి క్యాంప్‌కి వెళ్ళాను కదా, అక్కడ నేర్చుకొన్న విషయాల్నే నా జీవితంలో ప్రాక్టీస్ చేస్తున్నాను"

అంతలో వినయ్, "వాక్యం చదవడం, ఉదయాన్నే లేవడం, ప్రార్థన చేసుకోవడం బాగానే ఉన్నాయి. మేము కూడా అప్పుడప్పుడు చేస్తాము గానీ ఫోన్‌కి దూరంగా ఎలా ఉండగల్గుతున్నావు? అంత కంట్రోల్‌గా ఉండడం ఎలా సాధ్యమవుతుంది?"

సుధాకర్, చూడు వినయ్ "ఉదయ కాలపు ప్రార్థనలు, వాక్య ధ్యానం మొక్కుబడిగా, ఆచారంగా కాదు, ఆచరించాలనే ఆశతో, ఆనందముతో చేసేది, నేను అలా చేస్తున్నాను. 'దేవునికి దగ్గరగా ఉండాలంటే, కొన్నిటికి చాలా దూరంగా ఉండాలని క్యాంప్‌లో చెప్పారు. అందులో ముఖ్యమైనవి చెడ్డ స్నేహితులకు, చెడగొట్టే ఫోన్‌కి దూరంగా ఉండాలని చెప్పారు (కీర్తన 1:1). వినయ్, "నాకు తెలుసు! నా ఫోన్ నన్ను ఎంతగా పాడు చేసిందో, చెడగొట్టిందో, అందుకే ప్రార్థన పూర్వకంగా ఫోన్‌కి దూరంగా ఉంటున్నాను"

అంతలో శ్రీకాంత్ "ఫోన్ చూడడం తప్పెలా అవుతుందిరా? మనం శరీరంతో ఏమి చేయం కదా, చూస్తే తప్పేంటి?" అంటూ గొప్ప లాజిక్ తీస్తున్నట్లు అడిగాడు.

సుధాకర్, "అరేయ్, మొన్న జరిగిన డిటి క్యాంప్‌లో సరిగ్గా ఇదే మాట చెప్పారు. "చూస్తే తప్పేంటి" అంటారు? కానీ చూసినా, చేసినా ఒక్కటే అని అన్నారురా".

అవునా? అంటూ క్వశ్చన్ మార్క్ ముఖాలతో ఉన్న వినయ్‌కి, శ్రీకాంత్‌కి తన బైబిల్ తీసుకొచ్చి "మోహపు చూపు చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయంలో ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" (మత్తయి 5: 28) అనే వచనం చదివి దాని అర్థం చెప్పాడు. అందుకనే చేస్తేనే పాపం కాదు. అలాంటివి చూసినా పాపమే".

క్యాంప్‌లో ఈ మాటలు చెబుతున్నప్పుడు నాకు కొంచెం కష్టంగానే అన్పించింది. తర్వాత నేను స్పీకర్ అన్నని పర్సనల్‌గా కలిసి మాట్లాడాను. ఎందుకంటే మనకు తెలుసు కదరా ఫోన్‌లో ఏమేమి చూస్తామో! ఏమేమి చేస్తామో!!

స్పీకర్ అన్న తన బైబిల్ తెరిచి ముగ్గురు వ్యక్తుల ను చూపించాడు. హవ్వ, సంసోను, దావీదు ... ఆ మూడు చోట్ల 'చూచెను' అనే మాట చూపించి "దేహానికి దీపం కన్ను.. కన్ను చెడిపోతే దేహమంతా చీకటవుతుంది" (మత్తయి 6:22) అని, దాని పర్యవసానాలు, దేవుని పరిశుద్ధతను గూర్చి చెప్పాడు.

అరేయ్ శ్రీకాంత్ "అప్పుడు అర్థమైంది "చూపులు" పాపానికి ప్రాథమికంగా కారణమవుతాయి" అని. స్పీకర్ అన్న అంతటితో ఆగలేదు యాకోబు 1:15లో "దురాశ గర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును". చూపులలో నుండి, ఆలోచనలు, ఆలోచనలలో నుండి ఆశలు, ఆశలు దురాశలుగా మారడం, దురాశ నుండి పాపము, పాపము నుండి మరణము... ఇలా చెబుతున్నప్పుడు నా గుండె జల్లుమంది. తెలుసా! నేను అప్పుడే నిర్ణయించుకొన్నాను "నా చూపులు జాగ్రత్తగా"ఉండాలని.

ఈ మాటలు వింటున్న వినయ్‌కి, శ్రీకాంత్‌కి హృదయంలో గుచ్చినట్లు అన్పించాయి. ఇంకా వినాల నిపిస్తుంది కానీ కన్నులు భారముగా ఉండడాన్ని బట్టి ముగ్గురూ మెల్లగా నిద్రలోకి జారుకున్నారు.

మరుసటి రోజు కాలేజికి బంద్ ప్రకటించారు. రాయలసీమలో ప్రేమించిన అమ్మాయి మీద పెట్రోలు పోసి తగలబెడితే చనిపోయిన అమ్మాయికి న్యాయం జరగాలంటూ విద్యార్థి సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి.

ఆ విషయం తెలిసిన వినయ్, శ్రీకాంత్‌లు మరల నిద్రకు ఉపక్రమించారు. ఉదయం10 గం॥లు అయినా నిద్ర లేవలేదు. సుధాకర్ అన్నని కలవాలని బయటికి వెళ్ళాడు. 10 గం॥ల తర్వాత తీరిగ్గా లేచి వినయ్ ఫోన్ చూసుకొంటే నాలుగు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. ఎవరా ! అని తీసి చూస్తే.. రాణి నుండి వచ్చినవి.

రాణి, సుధాకర్‌కి ఫ్రెండ్. అప్పుడప్పుడు క్లాస్‌లో, క్యాంటీన్‌లో మాట్లాడేది. సుధాకర్‌కి ఇష్టం ఉందో, లేదో తెలియదు కాని రాణికి ఇష్టం ఉన్నట్లు అర్థమయ్యింది.

వినయ్ ఫోన్ చేసి రాణితో మాట్లాడుతున్నప్పుడు సుధాకర్, తనతో మాట్లాడవద్దని, ఫ్రెండ్‌లా కాకుండా క్లాస్ మేట్స్‌లా ఉందాము, నాతో ఎక్కువ మాట్లాడవద్దని చెప్పినట్లు రాణి వినయ్‌కి అన్ని విషయాలు చెప్పింది. అంతలో సుధాకర్ రూమ్‌కి రానే వచ్చాడు. రాణి విషయం తేల్చాలని సుధాకర్‌ని గట్టిగా పట్టు పట్టి అడిగాడు వినయ్.

సుధాకర్ మాట్లాడుతూ "డిటి క్యాంప్‌లో వాక్యం ద్వారా దేవుడు నాతో మాట్లాడిన మాటలను బట్టి, రాణికి 'నో' చెప్పాను. "నా పరిశుద్ధతను కాపాడు కోవడం కోసం నా ఒంటి మీద నాకు కాబోయే భార్య చేతులు తప్ప పరాయి స్త్రీ చెయ్యి పడనివ్వను". "పాన్పు నిష్కల్మషంగా ఉంచుకోవాలనే ఆశ" (హెబ్రీ 13:4). మరణానికైనా సిద్ధమే కాని మలినం కాకూడదు అని ధృడ నిశ్చయంతో దేవునికి మాట ఇచ్చాను. అందుకనే అమ్మాయిల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, పవిత్రంగా జీవించాలనే ఆలోచనతోనే తనతో స్నేహం వద్దనుకొన్నాను.

సుధాకర్ అలా మాట్లాడుతుంటే, ఏరి కోరి వచ్చిన అమ్మాయికి 'నో' చెప్పడంతో వినయ్‌కి, శ్రీకాంత్ నోట మాటలు రాలేదు.

వినయ్‌కి, శ్రీకాంత్‌కి క్రైస్తవ్యం తెలుసు, ప్రార్థన తెలుసు, వాక్యం తెలుసు, చర్చ్ తెలుసు కానీ క్రీస్తు కోసం ఇలా బతికే వాడిని మొదటి సారిగా చూస్తున్నారు. సుధాకర్‌లా బతకాలనే ఆశ, బతకలేక పోతున్నాము అనే ఆవేదన మిశ్రమంగా కన్పిస్తుంది.

ఇంతలో సుధాకర్ ఫోన్ మోగింది. అవతల అభిషేక్ అన్న... సాయంత్రం ఇంటికి రమ్మని, భోజనం కూడ ఇంట్లోనే అని చెప్పాడు. సాయంకాలము, సుధాకర్ రెడీ అయ్యి అభిషేక్ అన్న ఇంటికి వెళ్తూ రాత్రికి భోజనం వద్దు అని వినయ్‌కి, శ్రీకాంత్‌కి చెప్పి బయలు దేరాడు.

అభిషేక్ అన్న సుధాకర్ చదివే కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్. ఇల్లు చూడ ముచ్చటగా ఉంటుంది. ఇద్దరు పిల్లలు, నవ్వుతూ పలకరించే అక్క, ఆప్యాయంగా భుజంపై చెయ్యి వేసి మాట్లాడే

అన్న... ఎందుకో తెలియదు కాని అన్నతో గడిపే సమయం భలే సంతోషంగా అన్పిస్తుంది.

అభిషేక్ అన్న, సుధాకర్ ఇంటి పైకి వెళ్ళారు. సుధాకర్, చెప్పు ఎలా ఉన్నావు? క్యాంప్ ఎలా అనిపించింది? ఏమి నేర్చుకున్నావు?" అంటూ అభిషేక్ అన్న అడుగుతున్నాడు.

సుధాకర్, క్యాంప్ నుండి వచ్చిన తర్వాత ఎలా ప్రార్థన చేసుకొంటున్నాడో, ఎలా వాక్యం చదువుకొంటున్నాడో, సమయాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నాడో, ఫోన్, ఫ్రెండ్స్, అమ్మాయిల విషయంలో ఎలా ఉన్నాడో అన్నీ మనస్సు విప్పి మాట్లాడుతున్నాడు.

అభిషేక్ అన్నకి చాలా సంతోషం అన్పించింది. సుధాకర్‌ని బట్టి దేవునికి మనసులోనే స్తుతులు చెల్లించాడు.

అభిషేక్ అన్న సుధాకర్ని మెచ్చుకోవడం, సుధాకర్‌కి సంతోషంగా అన్పించినా తనలో ఉన్న భయాల్ని నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు. "అన్న.. ఇప్పటి వరకు ఫర్వాలేదు నిర్ణయాలకు తగ్గట్లుగా నిలబడ్డాను, కానీ నిలబడలేననే భయం నన్ను వెంటాడుతుంది" అని నెమ్మదిగా చెప్పాడు.

అభిషేక్ అన్న నవ్వుతూ సుధాకర్‌కి ధైర్యం చెబుతూ బైబిల్‌ని తెరచి మూడు సన్నివేశాలు చూపించాడు.

మొదటిది. బాహ్య ఒత్తిడిలు (మత్తయి 8:23-27). యేసు ప్రభువు వారు శిష్యులతో దోనె ఎక్కి ప్రయాణం చేస్తున్నప్పుడు.... అలల చేత దోనె కప్పబడుతుంది.. అప్పుడు శిష్యులు భయపడతారు. మన జీవితంలో కూడా బాహ్య ఒత్తిడుల చేత నిలబడలేని పరిస్థితి, భయపడే పరిస్థితులు వస్తాయి. సొంత కుటుంబం, సొంత స్నేహితులు, పాత పాపాలు, పాత పరిచయాలు... బయటినుండి ఒత్తిడిని తెచ్చి పడగొట్టే అవకాశాలు ఉన్నాయి. అయితే మత్తయి 8:26లో యేసు శిష్యులను గద్దించి, వారి విశ్వాసాన్ని ప్రశ్నిస్తాడు. అలాగే మనల్ని కూడా వాక్యం ద్వారా దేవుడు గద్దించి విశ్వాసం గురించి మాట్లాడి బలపరుస్తాడు. గద్దింపుకి లోబడినప్పుడు బాహ్య ఒత్తిడిని తట్టుకోగలము. ప్రేమతో గద్దించినప్పుడు లోబడాలి.

రెండవది: అంతరంగ ఒత్తిడులు (మత్తయి 14:26-33). పేతురు, యేసు ప్రభువు వారితో పాటు నీళ్ళ మీద నడుస్తాను అని చెప్పి, కొంత దూరం వెళ్ళి మునిగిపోసాగెను. కొన్ని సార్లు అంతరంగ ఒత్తిడులను బట్టి పడిపోవచ్చును. సొంత ఆశలు, సొంత ఆలోచనలు, సొంత కోరికలు, లోపలి నుండి వచ్చేవి... అంతరంగ ఒత్తిడులు పడగొడతాయి. అయితే మత్తయి 14:30 "ప్రభువా, రక్షించుము" అనే ప్రార్థనతో పేతురుని దేవుడు నడిపిస్తాడు. అంతరంగ ఒత్తిడుల్ని ప్రార్థన ద్వారా అధిగమిస్తాము.

మూడవది: "కొందరు సందేహించిరి" (మత్తయి 28:16-20). కొన్నిసార్లు సందేహిస్తాము. అప్పుడు పడిపోతాము, నిలబడలేము. అయితే మత్తయి 28:17 సదాకాలము మీతోనే ఉన్నాను అనే వాగ్దానం ఇవ్వడం జరిగింది. కాబట్టి సదాకాలము దేవుడు నాలో ఉన్నాడన్న స్పృహ గల్గి, వాగ్దానమును నమ్మి ముందుకు సాగాలి.

నిజమైన శిష్యుడు పడిపోయినప్పుడు, ఓడిపోతునప్పుడు ఒప్పుకుంటాడు. కప్పుకోడు, తప్పించుకోడు. దేవుని సహాయం కోరుకొంటూ దిన దినం ఎదుగుతూ ఉంటాడు. అందుకనే విశ్వాసమునకు కర్త, దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచూ .. ముందుకు సాగాలి (హెబ్రీ 12:1).

కాబట్టి చూడు సుధాకర్ బయట ఒత్తిడిల వలన కాని, లోపల ఒత్తిడిల వలన కాని, సందేహాల వల్ల గాని పడిపోయే పరిస్థితుల్లో వాక్యం, ప్రార్థన, విశ్వాసం కలిగి సదాకాలం మనతోనే ఉంటాను అని ప్రభువిచ్చిన వాగ్దానాన్ని చేబూని నిలకడగా కొనసాగాలి. సుధాకర్‌కి ధైర్యం వచ్చి, విశ్వాసంలో ఎదగాలని ఆశ పుట్టింది. నా కోసం ప్రార్థించండి అన్న అని అడిగిన సుధాకర్ కోసం అభిషేక్ అన్న ప్రార్థన చేశాడు.

అంతలో అభిషేక్ అన్న వాళ్ళ బాబు ఇవాన్స్ పైకి వచ్చి డాడీ, మమ్మీ మీ ఇద్దరినీ భోజనానికి రమ్మంటుంది అంటూ పిలిచాడు. సుధాకర్ అన్న ఇంట్లో చికెన్ బిర్యాని సంతోషంగా, తృప్తిగా ఆరగించి, దేవునిలో నిలకడగా కొనసాగాలనే తీర్మానంతో తన రూమ్‌కి వెళ్ళాడు.

**- యం. గాలెయ్య,** భీమవరం

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-10-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# పేరుకే శిష్యులం



చెప్పుకోడానికే శిష్యులం
వలలు విడిచేది లేదు
వెంబడించేది లేదు
పరిశుద్ధుని అడుగు జాడల్లో నడుస్తూ
పరిచర్య చేయడం అసలే లేదు!

పేరుకే శిష్యులం
వేరులో నిలిచేది లేదు
ఏపుగా ఫలించేది లేదు
పనికిరాని తీగలను
పారవేసేది అంతకన్నా లేదు!

అనుదిన జీవితంలో
అచ్చెరువొందే
కార్యాలెన్నో చూసినా
ఇంకా అల్ప విశ్వాసికి
బ్రాండ్ అంబాసిడర్‌గానే ఉన్నాం
పరిస్థితులన్నిటిపైన
ప్రభుత్వం చేసే అధికారమున్నా
ప్రత్యక్షంగా అద్భుతాలెన్నో చూసినా
మతిమరుపుకు మారుపేరులా ఉన్నాం

మంద మేయని పచ్చికలా
ఎవ్వరూ తాగలేని సెలయేరులా
గొర్రెలు లేని కాపరిలా
నిస్సారంగా జీవిస్తూ
నిస్తేజంగా సేవిస్తూ
గాలి వీచిన వైపు కొట్టుకు పోయే మబ్బుల్లా ఉంటే
సర్వ సృష్టికి సువార్తను ప్రకటించేదెవరు?
సమస్త జనులను శిష్యులుగా చేసేదెవరు?

– గొంగటి మేరి జాయ్, ఆదోని